


ఇంటర్ సెకండియర్ పరీక్షలు షురూ



విద్యార్థులను తనిఖీ చేసి లోనికి పంపిస్తున్న దృశ్యం

6

బీసీ విద్యార్థులకు మహర్దశ

- మంత్రి తుమ్మల కృషితో బీసీ హాస్టళ్లకు నూతన భవనాలు
- నగరంలో మూడింటికి అనుమతులు
- రూ.3 కోట్ల చొప్పున రూ.9 కోట్లు మంజూరు

ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో శిథిలావస్థలో ఉన్న బీసీ వెల్ఫేర్ హాస్టల్స్‌లో నూతనంగా కొత్తభవనాల మంజూరుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో ఖమ్మంలో మూడు బీసీ వెల్ఫేర్ హాస్టల్ భవనాలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఒక్కో భవనానికి రూ.3కోట్ల చొప్పున మొత్తం మూడు భవనాలకు రూ.9కోట్లు మంజూరు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జీవో నెంబరు 50ని జారీ చేసింది. ఒక్కో భవనాన్ని అత్యాధునిక హంగులతో నిర్మించనున్నారు.

ఖమ్మం నియోజకవర్గంలో శిథిలావస్థలో ఉన్న బీసీ వెల్ఫేర్ హాస్టల్ స్థానంలో ఈ నూతన భవనాలు నిర్మించనున్నారు. హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన మంత్రి తుమ్మల నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వానికి పలుమార్లు ప్రతిపాదనలు పంపారు. రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం బీసీ బాయ్స్ హాస్టల్, ఖమ్మంనగరంలోని ముస్తాఫనగర్‌లోని బీసీ బాయ్స్ హాస్టల్ 1, జహీరపురలోని బీసీ బాయ్స్ హాస్టల్ 2కు నూతన భవనాలు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి మంత్రి తుమ్మల త్వరలో శంకుస్థాపన చేయనున్నారు.

ఏమార్చిన మిర్చి



కల్లంలో ఆరబోసిన తేజ మిర్చి



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చియార్డు

భారీగా పతనమవుతున్న తేజ రకం ధర

- గత ఏడాదితో పోల్చితే క్వింటాకు రూ.5వేల వ్యత్యాసం
- పెట్టుబడులు కూడా రావట్లేదంటున్న రైతులు
- తెరపైకి మిర్చి బోర్డు ఏర్పాటు అంశం
- ఖమ్మంలో ఏర్పాటు చేయాలని రైతులు, రైతు సంఘాల డిమాండ్

ఖమ్మం, మార్చి 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): వాణిజ్య పంటల్లో 'ఎర్ర బంగారం'గా పేరు పొందిన ఎండుమిర్చి ప్రస్తుతం రైతుల కంట కన్నీరు తెప్పిస్తోంది. ఈ సంవత్సరం మిర్చి ధరలు భారీగా పతనమవ్వడంతో అష్టకష్టాలు పడి సాగుచేసిన రైతులు దిగాలు పడుతున్నారు. గతంలో వాణిజ్య పంటల్లో లాభసాటి పంటగా నిలిచిన మిర్చి నేడు జూదంలా మారింది. రైతు చేతిలో పంట ఉన్నప్పుడు ధర తగ్గడం, పంట వారి చేయిదాటి పోయిన తరువాత ధర పెరుగుతుండడంతో ఈ పంటను నమ్ముకున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది ఫిబ్రవరిలో క్వింటాకు రూ.18వేల నుంచి రూ.20వేల వరకు ఉన్న మిర్చి ధర ప్రస్తుతం రూ.12వేల నుంచి రూ.14వేలు మాత్రమే పలుకుతుండటంతో రైతులు (మిగతా 6వ పేజీలో)

పంట పండింది.. ధర లేదు

జి.వెంకటేశ్వర్లు, తనికెళ్ల



ఈ ఏడాది చీడపీడలు తగ్గడంతో మిర్చి పంట బాగానే పండింది. ఎకరానికి 20క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కానీ మార్కెట్‌లో ధర లేదు. గ్రామాల్లో వ్యాపారులు వచ్చి రూ.12నుంచి 13వేలకే కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.20వేలు ప్రకటించి కొనుగోలు చేయాలి. లేకపోతే మిర్చి రైతులు తీవ్రగా నష్టపోయే పరిస్థితి ఉంది. పెట్టుబడులు ఏటికేడు పెరుగుతున్నాయి. పెట్టుబడి ఖర్చు ఎకరానికి కనీసం రూ.లక్షా 50వేల వరకు వస్తుంది. ఇంటిల్లిపాది చేసిన కష్టం లెక్కిస్తే ప్రస్తుతం పలికే ధర, వచ్చే సొమ్ముకు పొంతనలేదు.

భక్తులు మెచ్చేలా ఏర్పాట్లుండాలి

- ఆన్‌లైన్‌లో 75 శాతం టికెట్లు విక్రయించాలి
- నాసిరకం బారికేడ్‌లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు
- 31 లోపు ఏర్పాట్లు పూర్తి కావాలి : భద్రాద్రి కలెక్టర్ జితేష్
- శ్రీరామనవమి ఏర్పాట్లపై సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

భద్రాచలం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈసారి నిర్వహించిన వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు, ఏరు ఫెస్టివల్ విజయవంతమయ్యాయి. అధికార యంత్రాంగం బాగా పని చేసింది. ఇదే రీతిలో ఈసారి శ్రీరామనవమి, శ్రీరామ మహాపట్టాభిషేకాలు భక్తులు మెచ్చే రీతిలో ఏర్పాట్లుండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. భద్రాచలంలోని సబ్ కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో శ్రీరామనవమి ఏర్పాట్లపై జిల్లాస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవమి, పట్టాభిషేకం ఉత్సవాలకు నెల రోజుల సమయం ఉన్నందున అధికారులందరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పని చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలు తిలకించే విధంగా ఏర్పాట్లు ఉండాలని అధికారులను ఆదేశించారు. అలాగే భక్తులకు ఆన్‌లైన్ ద్వారా 75శాతం టికెట్లు కేటాయించాలని, 25 శాతం ఆఫ్‌లైన్‌లో కౌంటర్ల ద్వారా విక్రయించాలన్నారు. సెక్టార్లలో బారికేడ్ల నిర్వహణలో (మిగతా 6వ పేజీలో)



సాగర్ రెండోజోన్‌కు నీరు నిలిపివేత

పాలేరు జలాశయం నీటిమట్టం పెంచేందుకు అధికారుల చర్యలు



గణనీయంగా తగ్గిన పాలేరు జలాశయం

కూసుమంచి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పాలేరు జలాశయం నుంచి రెండోజోన్ ఆయకట్టుకు అధికారులు సాగర్ నీటి విడుదల నిలిపివేశారు. జలాశయం నీటిమట్టం గణనీయంగా పడిపోతుండటంతో, పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. పాలేరు జలాశయం గరిష్ట నీటిమట్టం 23 అడుగులకుగాను ప్రస్తుతం 16 అడుగుల మేర మాత్రమే నీరు నిల్వ ఉంది. దీంతో ఒకరోజు రెండోజోన్ ఆయకట్టుకు నీరు నిలిపివేసి, శుక్రవారం మధ్యాహ్నం తిరిగి విడుదల చేస్తామని డీఈ మధు తెలిపారు. సాగర్ మొదటి జోన్ జోన్ నుంచి ప్రస్తుతం 5800 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా పాలేరు చేరుతున్నట్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి నీటిమట్టం 18.5 అడుగులకు చేరే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా పాలేరు పాతకాల్వకు 200 క్యూసెక్కులు, భగీరథ ప్రాజెక్టుకు 130 క్యూసెక్కులు, భక్తరామదాసు ప్రాజెక్టుకు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

భద్రాద్రిలో ఐఏఎస్ స్నేహ పెళ్లి

రామయ్య సన్నిధిలో ఒక్కటైన జంట



ఒడిశా కేడర్‌కు చెందిన 2022 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అరుగుల స్నేహ-అఖిల్ రెడ్డిల వివాహం భద్రాచలంలో జరిగింది. భద్రాద్రి దేవస్థానానికి చెందిన మారుతిసదనంలో గురువారం ఈ వివాహ వేడుక నిర్వహించగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో బి.రాహుల్, భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవితో పాటు పలువురు ఐఏఎస్ అధికారులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇదిలా ఉండగా అరుగుల స్నేహ నిజామాబాద్ జిల్లావాసి. యుపీఎస్సీలో 136వ ర్యాంకు సాధించి ఒడిశా కేడర్‌లో జాయింట్ కలెక్టరుగా పని చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, భద్రాచలం

కష్టాల కడలిలో నిరుద్యోగులు, రైతులు

- మాయమాటలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది
- రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీదే అధికారం
- సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్

ఖమ్మం బైపాస్‌రోడ్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నిరుద్యోగులను, రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు చీకోటి ప్రవీణ్ ఆరోపించారు. నగరంలోని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ జిల్లా అధ్యక్షుడు సన్నె ఉదయ్‌ప్రతాప్ నివాసంలో శుక్రవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తూ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల రాష్ట్ర ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని, అదేమాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తప్పిదాలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చి పలు హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని నెరవేర్చకుండా తుంగలో తొక్కారన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా జిల్లా అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా.. 42 నియోజవర్గాల్లో బీజేపీ రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలవడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాబోతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న స్కాంలు ప్రజలందరికీ తెలుసని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రైతుబంధు ఇవ్వడానికి నిధులు లేవంటూ మాటలు చెబుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో డబుల్ ఇంజన్ సర్కారుతో గెలిచి రాష్ట్రంలో అభివృద్ధి అంటే ఏంటో బీజేపీ చూపిస్తుందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, దేవకి వాసుదేవరావు, రవికుమార్, వెంకటేశ్వర్లు, శీలం పాపారావు, వీరభద్రం, లక్ష్మీనారాయణగుప్తా పాల్గొన్నారు.

జల బంధం

- కృష్ణా, గోదావరి జలాల అనుసంధానం పూర్తి
- ఏన్కూరు వద్ద సాగర్ కాల్వకు చేరిన గోదావరి నీరు
- నెరవేరిన మంత్రి తుమ్మల చిరకాల స్వప్నం
- గోదావరి జలాల రాకతో పులకించిన అన్నదాతలు
- సాగునీటి కష్టాలు తీరుతాయని ఆనందం



ఏన్కూరు వద్ద సాగర్ కాలువలో కలుస్తున్న గోదావరి నీరు

ఏన్కూరు/జూలూరుపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నో వ్యయ ప్రయాసల తరవాత ఎట్టకేలకు గోదావరి, కృష్ణా జలాల అనుసంధానం పూర్తయ్యింది. సీతారామ ప్రాజెక్టు ద్వారా వచ్చిన గోదావరి జలాలు ఏన్కూరు వద్ద సాగర్ జలాలతో కలిశాయి. సీతారామ మెయిన్ కెనాల్ నుంచి జూలూరుపాడు మండలం వినోభానగర్ దగ్గర రాజీవ్ లింక్ కెనాల్‌కు బుధవారం రాత్రి మంత్రి తుమ్మల గోదావరి జలాలను విడుదల చేసిన విషయం తెలిసిందే. అక్కడి నుంచి లింక్‌కెనాల్ ద్వారా గురువారం ఏన్కూరు వద్ద నాగార్జునసాగర్ ప్రధాన కాలవలో సాగర్ జలాలతో గోదావరి జలాలు కలిశాయి. ఈ జలాలను చూసేందుకు రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గోదావరి జలాలను చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ హెడ్ రెగ్యులేటరీ లాకులు ఎత్తడంతో దిగువకు నీళ్లు వెళుతున్నాయి. ఆ తర్వాత ఒకటి రెండు రోజుల్లో లాకులను దించి వైరా రిజర్వాయర్‌కు గోదావరి నీటిని మళ్లిస్తారు. దీంతో సాగర్ జలాలు రాకపోయినా గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం కానుంది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పట్టుబట్టి ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేయించారు. దీంతో ఆయన చిరకాల స్వప్నం నెరవేరింది. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులకు మెరుగైన ప్యాకేజీ ఇప్పించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కూడా నిత్యం పర్యటిస్తూ ప్రాజెక్టు నిర్మాణానికి కృషిచేశారు. రాజీవ్ లింకు కెనాల్ ద్వారా గోదావరి జలాలు రావడంతో భూములు ఇచ్చిన రైతులు, ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ లింక్‌కెనాల్ కింద సుమారు 1.20లక్షల ఎకరాల భూమి సాగులోకి వస్తుంది. వైరా, లంకాసాగర్ నింపడంతో వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో తాగు, సాగునీటి ఇబ్బందులు తొలిగిపోనున్నాయి. వైరా నియోజకవర్గంలోని చెరువులు, కుంటల వద్ద లిఫ్టులు పూర్తిస్థాయిలో పనిచేస్తాయి. ఏన్కూరు, తల్లాడ, కల్లూరు, కొణిజర్ల, వైరా మండలాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుంది. ఈ లింకుకెనాల్‌లో గోదావరి ప్రవాహ వేగాన్ని (మిగతా 6వ పేజీలో)

తుమ్మల కృషితో మెరుగైన ప్యాకేజీ

గుగులోత్ శోభన్‌నాయక్, భగవాన్‌నాయక్ తండా



రాజీవ్ లింక్ కెనాల్ కింద భూములు కోల్పోయిన రైతులకు మెరుగైన ప్యాకేజీ కోసం మంత్రి తుమ్మల నాగేశ్వరావు కృషిచేశారు. ఎకరానికి రూ.21లక్షలు మంజూరు చేయించినందుకు ముక్తకంఠంతో మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం. గోదావరి జలాలు ఈ ప్రాంతానికి రప్పించినందుకు రైతులు సంతోషంగా ఉన్నారు.



శివ (ఫైల్)

ప్రాణం తీసిన అనుమానం

- వివాహేతర సంబంధం సాకుతో మహిళ భర్త దాడి
- యువకుడికి తీవ్ర గాయాలు... చికిత్స పొందుతూ మృతి
- భద్రాద్రి జిల్లా ఆర్లపెంటలో ఘటన

7



హెలీకాప్టర్‌లో వచ్చి..

- ముదిగొండలో రోడ్డు విస్తరణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి శంకుస్థాపన
- బాణాపురంలో వివాహ వేడుకకు హాజరు

6

జీవనశైలి, మారుతున్న ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి.. మహిళల్లో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. పౌష్టికాహార లోపం, రక్తహీనతతో పాటు ప్రమాదకర క్యాన్సర్, థైరాయిడ్ లక్షణాలు బయటపడుతున్నాయి. అవగాహన లోపంతో తీవ్రత పెరిగాక వ్యాధి ఉన్నట్టు గుర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో అతివల్లో ప్రాణాంతక వ్యాధులను ఆదిలోనే గుర్తించి తొలి దశలోనే అడ్డుకట్ట వేసేందుకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2023 మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 'ఆరోగ్య మహిళా కేంద్రాలు' ఏర్పాటు చేసింది. అతివలకు ప్రత్యేక ఆరోగ్య సేవలు ప్రారంభమై నేటికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం...


ఆరోగ్య మహిళా కార్యక్రమంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

అతివకు ఆరోగ్యమస్తు!

- 28,544 మందికి పరీక్షలు.. 181 మందికి వ్యాధుల నిర్ధారణ
- ఆరోగ్య మహిళ కార్యక్రమానికి నేటితో రెండేళ్లు పూర్తి

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నిత్యం కుటుంబ, ఉద్యోగ, ఉపాధి బాధ్యతల్లో తీరిక లేకుండా గడిపే అతివలు వివిధ అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. చాలామంది అవగాహన లేకపోవడం, ఆర్థిక పరిస్థితులతో బయటకు చెప్పుకోలేకపోతున్నారు. సాధారణ జబ్బులుగా భావించి చికిత్స చేయించుకోవడం లేదు. వ్యాధి తీవ్రత పెరిగి ఆస్పత్రిలో చేరినా అదుపులోకి రాక ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ క్రమంలో వ్యాధులను ఆదిలోనే గుర్తించేందుకు ప్రభుత్వం ఆరోగ్య మహిళా కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లావ్యాప్తంగా ఖమ్మం జనరల్ ఆస్పత్రితోపాటు ఇప్పటి వరకు 12 పీహెచ్‌సీల్లో ఈ ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 28,544మందికి పరీక్షలు నిర్వహించారు.

నిరుపేదలకు వరంగా ...!

ప్రతి మంగళవారం ఆరోగ్య మహిళా కేంద్రాల్లో సేకరించిన రక్త నమూనాలను జిల్లా కేంద్రాల్లోని టీ డయాగ్నస్టిక్ కేంద్రాలకు పంపిస్తున్నారు. సాధారణంగా ప్రైవేటు రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రాల్లో థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్, విటమిన్ ప్రొఫైల్, సీబీపీ పరీక్షలకు రూ.8 నుంచి రూ.10వేల వరకు ఖర్చవుతుంది. ఆరోగ్య మహిళా కేంద్రాల్లో వీటిని ఉచితంగా నిర్వహిస్తున్నారు. వ్యాధి లక్షణాలున్న వారిని ఆన్‌లైన్ వివరాల ఆధారంగా జిల్లా ఆస్పత్రికి రప్పించి మెరుగైన వైద్య సేవలందిస్తున్నారు.



3 దశల్లో వైద్య చికిత్సలు..!

ఆరోగ్య మహిళా కేంద్రాల్లో మూడు దశల్లో సేవలందిస్తున్నారు. ముందుగా ట్యాబుల్లో మహిళల ఆధార్, సెల్‌నెంబర్ వివరాలు పొందుపరుస్తారు. అక్కడే షుగర్ పరీక్ష నిర్వహిస్తారు. బరువు, ఎత్తు కొలతలు తీసుకుంటారు. రెండో విభాగంలో వ్యాధి లక్షణాలు, సమస్యలను వైద్యాధికారి తెలుసుకుంటారు. అనుమానాలుంటే మూడో విభాగానికి పంపించి రక్త నమూనాలు తీసుకుంటున్నారు. ఈ మూడు దశల్లో సేకరించే ప్రతి అంశాన్నీ ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు.

8 రకాల పరీక్షలు

ఆరోగ్య మహిళా కేంద్రాల్లో ప్రతి మంగళవారం థైరాయిడ్, క్యాన్సర్, ఇతర వ్యాధుల స్ర్కీనింగ్, సూక్ష్మ పోషకలోపాల గుర్తింపు, మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, హార్మోన్ అసమతుల్యతలు (పీసీవోఎస్), రుతుస్రావం నిలిచిపోవడం (మెనోపాజ్), శరీర బరువు ఇలా మొత్తం ఎనిమిది రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరించి జిల్లాకేంద్రాల్లోని టీ డయాగ్నస్టిక్ కేంద్రాలకు పంపిస్తున్నారు. క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించి అనుమానితులు, లక్షణాలున్న వారిని బయాప్సీ, మెమోగ్రామ్ తదితర పరీక్షల కోసం జిల్లా ఆస్పత్రికి సిఫార్సు చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో రొమ్ము కాన్సర్ ఉన్నవారు 71, గర్భసంచి కాన్సర్ ఉన్నవారు 55, నోటి క్యాన్సర్ ఇద్దరికి, ఇతరత్రా క్యాన్సర్లు (బోన్, థైరాయిడ్ లాంటి) ఉన్నవారు 53 మంది మొత్తం 181మంది ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 31 మంది మృతిచెందినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు.

చైతన్యంతో సేవలు మెరుగు

జిల్లాలో ప్రయోగాత్మకంగా 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళలకు ప్రత్యేక సేవలందిస్తున్నారు. పల్లెలు, పట్టణాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు వైద్య సేవలపై అతివలకు అవగాహన కల్పిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షిస్తున్నా.. కొన్ని చోట్ల దూరంగా ఉన్న కేంద్రాలకు ఆశించిన స్థాయిలో వెళ్లడం లేదు. క్యాన్సర్ లక్షణాలను తొలిదశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం లేకుండా జాగ్రత్త పడవచ్చని మహిళలకు చైతన్యాన్ని కల్పిస్తున్నారు. ఈ ఏడాది నుంచి కొత్తగా మరో 18 కేంద్రాలకు ఈ సేవలను విస్తృత పరుస్తున్నారు.

ముందుగా గుర్తిస్తే వ్యాధి తీవ్రత తగ్గించొచ్చు

డాక్టర్ ప్రేమలత, ఆరోగ్య మహిళా బాధ్యురాలు



ఆరోగ్య మహిళ కేంద్రాల్లో థైరాయిడ్, హార్మోన్ ఇన్‌బ్యాలెన్స్ మూత్రాశయ సమస్యలను గుర్తిస్తున్నాం. ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్సలు అందిస్తున్నాం. సీరియస్ కేసులను హైదరాబాద్‌కు పంపిచడం అక్కడ నిర్ధారణ అయిన వారికి ఇక్కడ మందులు ఇస్తున్నాం. ప్రాణాంతకమైన వ్యాధులను గుర్తించి చికిత్స అందిస్తే మరణాలను నిరోధించవచ్చు.

భయం వీడాలి..

- మహిళలు ఆస్పత్రికి వెళ్తే ఇతర రోగాలు బయటపడతాయని భయంతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవడం లేదు.
- చాలా మంది మహిళలు అవగాహన లేక, ఆర్థిక స్థోమత సరిపోక ఆస్పత్రులకు వెళ్లడం లేదు.
- గైనిక్ సంబంధిత అంతర్గత సమస్యలను బయటకు చెప్పుకోవడానికి సంకోచిస్తున్నారు.
- ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తించక తీవ్రత పెరిగాక చికిత్స చేయించుకున్నా నయంకావడం లేదు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు షురూ

- ఇరుజిల్లాల్లో తొలిరోజు ప్రశాంతం
- ఖమ్మం జిల్లాలో 16,855మంది హాజరు
- భద్రాద్రి జిల్లాలో 8,759 మంది

ఖమ్మం ఖానాపురంహవేలి/కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇరు జిల్లాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.

ఖమ్మం జిల్లాలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, హిందీ, ఉర్దూ, అరబిక్, సంస్కృతం పరీక్షలు నిర్వహించారు. మొత్తం జనరల్ విద్యార్థులు 15,190 మందికి 14,867 మంది పరీక్షలకు హాజరుకాగా, 323 మంది గైర్హాజరు, ఒకేషనల్ విద్యార్థులు 2,072 మందికి 1,988మంది హాజరుకాగా 84మంది గైర్హాజరు అయ్యారు. మొత్తం 17,262 మంది విద్యార్థులకు 16,855 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో ఎక్కడ మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఐఈవో కె.రవి బాబు తెలిపారు. పోలీస్ స్టేషన్ నుంచి ఎస్కార్ట్ సహాయంతో ప్రశ్నాపత్రాలను నేరుగా పరీక్షా కేంద్రాలకు పోలీస్ బందోబస్తు నడుమ తరలించారు. సీసీ కెమెరాల నడుమ ప్రశ్నపత్రాల సీల్ ఓపెన్ చేసినట్టు డీఐఈవో తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, హెల్త్ సెంటర్లను, ఇతర సదుపాయాలు, ఏర్పాటు చేశారు.


చుంచుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బారులు తీరిన ఇంటర్ విద్యార్థులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా 36 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 9030 మంది విద్యార్థులగాను 8,759 (జనరల్ - 7096, ఒకేషనల్ - 1663 మంది అభ్యర్థులు) పరీక్షలకు హాజరవుగా, 271 మంది గైర్హాజరైనట్లు నోడల్ అధికారి హెచ్. వెంకటేశ్వరరావు వివరాలు వెల్లడించారు. ఈ పరీక్షలను 36 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 36మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 13మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, ముగ్గురు సిట్టింగ్ స్క్వాడ్, ఐదుగురు కస్టోడియన్స్ అధికారులు, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. మొత్తం 550 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


ఖమ్మంలో పరీక్షా కేంద్రంలోకి వస్తున్న విద్యార్థినులు

రహదారి నిర్మాణానికి డిప్యూటీ సీఎం భట్టి శంకుస్థాపన

ముదిగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాణాపురం, ముదిగొండ గ్రామాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గురువారం పర్యటించారు. ఉదయం పదిగంటలకు హైదరాబాద్ నుంచి ముదిగొండకు హెలీకాప్టర్ ద్వారా చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద భట్టి విక్రమార్కకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్ పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ముదిగొండ ప్రధాన సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి భట్టి విక్రమార్క పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముదిగొండ ప్రధాన సెంటర్ నుంచి వల్లభి రహదారిలో ఐదు కిలోమీటర్ల వరకు విస్తరణలో భాగంగా రూ.28కోట్ల వ్యయంతో రెండులైన్ల రహదారిని నాలుగులైన్ల రహదారి, డ్రెయినేజీ, ఫుట్‌పాత్ నిర్మాణాలకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. కబరస్థాన్ చుట్టూ ప్రహరీ లేదని దాని నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ముదిగొండ ముస్లిం సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. బాణాపురంలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కొమ్మినేని రమేష్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హేమలత, ఈఈ యుగంధర్, ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, మాజీ జడ్పీటీసీలు మందరపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, మల్లెల అజయ్, వెంకటేశ్వరరావు, ఝాన్సీ రమేష్, ఉపేంద్రరావు పాల్గొన్నారు.


రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న భట్టి విక్రమార్క


రామాలయంలో ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయాధికారి

రామయ్యను దర్శించుకున్న ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయాధికారి

భద్రాచలం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారిని గురువారం ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలకగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయాధికారి శివనాయక్, దేవస్థానం పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా, వేద పండితుడు లింగాల రామకృష్ణప్రసాద్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఏమార్చిన మిర్చి



(5వ పేజీ తరువాయి)

క్వింటాకు కనీసం రూ.5వేలు నష్టపోతున్నారు. తామరపురుగు కారణంగా గత రెండేళ్లలో ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్లలోపే దిగుబడి రాగా ఈ ఏడాది చీడపీడలు లేకపోవడంతో 15నుంచి 20 క్వింటాళ్లకు పైగా దిగుబడులు వస్తున్నాయి. కానీ మార్కెట్‌లో ధర లేకపోవడంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదు.

ఉమ్మడి జిల్లాలో లక్ష ఎకరాల్లో సాగు

తెలుగు రాష్ట్రాల్లో మిర్చిసాగులో గుంటూరు తర్వాత ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. గోదావరి పరివాహకంతోపాటు సాగర్ ఆయకట్టు పరిధిలో మిర్చిసాగు చేపడతారు. గతేడాది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షన్నర ఎకరాల్లో మిర్చి సాగుచేయగా.. ఈ ఏడాది లక్ష ఎకరాల్లోనే సాగులో ఉంది. ప్రధానంగా భద్రాచలం, పినపాక, కొత్తగూడెం, వైరా, ఖమ్మం, పాలేరు మధిర నియోజకవర్గాల్లో మిర్చి సాగు అధికంగా ఉంది. మిర్చికి పెట్టుబడి భారీగా ఉంటుంది. దుక్కి దున్నే దగ్గర నుంచి పంటను మార్కెట్‌కు తరలించే వరకు రైతులకు ఎకరానికి రూ.లక్షనుంచి లక్షన్నర వరకు పెట్టుబడి ఖర్చు ఉంటుంది. కౌలు రైతులకు భూమి స్వభావం, నీటి వసతిని బట్టి కౌలు రూ.25వేల నుంచి రూ.35వేలు అదనంగా ఖర్చవుతుంది. అయితే మిర్చి సాగుకు ఇంత ఖర్చు చేసినా.. దిగుబడులు ఆశాజనకంగా ఉండి మార్కెట్‌లో మంచి ధర ఉంటేనే రైతులు లాభాలు పొందే అవకాశం ఉంది. ధరలు తగ్గితే మాత్రం పెట్టుబడులు కూడా రావడం కష్టమేనని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఖమ్మం మార్కెట్‌లో మిర్చి జెండాపాట రూ.14,125గా నిర్ణయిస్తున్నా.. నాణ్యత లేదంటూ వ్యాపారులు కొనుగోళ్ల సమయంలో క్వింటా రూ.12నుంచి రూ.13 వేలకే కొనుగోలు చేస్తున్నారు. గత డిసెంబరులో మార్కెట్‌కు కొత్త మిర్చి వచ్చినప్పుడు క్వింటాకు రూ.17వేలు ధర పలికింది. అది క్రమంగా తగ్గుతూ రూ.14వేలకు చేరింది. ప్రస్తుతం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రోజుకు లక్షకుపైగా మిర్చి బస్తాలు అమ్మకానికి వస్తున్నాయి.

తగ్గిన విదేశీ ఎగుమతులు

ఖమ్మం జిల్లాలో పండే తేజారకం మిర్చి సన్నగా, ఘాటుగా ఉండడంతో దీనికి భారీగా డిమాండ్ ఉంటుంది. గడిచిన రెండేళ్లలో ఈ మిర్చికి క్వింటాకు రూ.18వేల నుంచి రూ.22వేల వరకు ధర పలికింది. గత ఏడాది వరకు విదేశీ ఎగుమతులు కూడా ఆశాజనకంగానే ఉండేవి. అయితే ఈ ఏడాది విదేశాల్లో కూడా మిర్చి సాగు పెరగడంతో విదేశీ ఆర్డర్లు తగ్గడంతో ఎగుమతులు తగ్గాయి. ఖమ్మం జిల్లాలో పండుతున్న మిర్చి చైనా, బంగ్లాదేశ్, మలేషియా, సింగపూర్, ఇండోనేషియా, తైవాన్, శ్రీలంక తదితర దేశాలకు ఎగుమతి అవుతుంది. చైనా వంటి దేశాలు తమ రైతులకు ప్రోత్సాహకాలు ఇచ్చి మిర్చి సాగును పెంచుతున్నాయి. అంతేకాకుండా మన వద్ద మిర్చి సాగులో ఎక్కువగా క్రిమిసంహారక మందులు వినియోగిస్తుండడం కూడా ఎగుమతులపై ప్రభావం చూపుతోంది.

ఏసీల్లో దాచేందుకు విముఖత..


ఈసారి వ్యాపారులు, రైతులు మిర్చిని ఏసీ గోదాంలలో పెట్టడంలేదు. నేరుగా దేశీయ, విదేశీ ఎగుమతులకు పంపిస్తున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌నుంచి ప్రతిఏడాది 40లక్షల బస్తాలు కొనుగోలు చేసే పరిస్థితి ఉండగా ఇప్పటి వరకు 10లక్షల బస్తాలు మాత్రమే కొనుగోళ్లు జరిగాయి. ఈ సారి 50లక్షల బస్తాలు మార్కెట్‌కు అమ్మకానికి వస్తాయని మార్కెటింగ్‌శాఖ అంచనా వేస్తుండగా మార్చినుంచి మే వరకు ముమ్మరంగా మిర్చి కొనుగోళ్లు జరిగే అవకాశం ఉంది. ఈ తరుణంలో ధర మరికొంత తగ్గే అవకాశం ఉంటుందని వ్యాపారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎవ్వరూ తమ మిర్చిని గోదాంలలో ఉంచేందుకు మొగ్గు చూపడం లేదు.

తెరపైకి మిర్చిబోర్డు అంశం

సుగంధ ద్రవ్యాల్లో ఒకటిగా ఉన్న మిర్చి కోసం ప్రత్యేకబోర్డు ఏర్పాటుచేయాలని ఖమ్మం జిల్లా రైతులు, రైతుసంఘాలు ప్రభుత్వాలకు విన్న వించుకుంటున్నాయి. సుగంధ ద్రవ్యాల్లో ఒకటైన పసుపుకోసం నిజామాబాద్‌లో కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటుచేసింది. అదే తరహాలో రెండు తెలుగురాష్ట్రాలకు గుమ్మంగా ఉన్న ఖమ్మంలో మిర్చిబోర్డు ఏర్పాటుచేస్తే తెలంగాణ, ఏపీ రైతులకు లాభం జరుగుతుందని రైతులు కోరుతున్నారు. ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధుల కేటాయింపు ద్వారా కనీస మద్దతు ధర, ధరల స్థిరీకరణకు నిధుల ఏర్పాటు, మిర్చి నాణ్యత, దిగుబడులు పెంచేందుకు అవసరమైన సాంకేతిక శిక్షణలు, మిర్చి సాగులో దిగుబడులు పెంచడం, పెట్టుబడులు తగ్గించడంపై మిర్చి బోర్డు ద్వారా సలహాలు తీసుకోవడం, అలాగే మిర్చిని దేశ, విదేశాలకు ఎగుమతి చేసేందుకు అవసరమైన శిక్షణ, సదుపాయాలు కలుగుతాయని, మిర్చి ఆధారిత పరిశ్రమలు వస్తాయని రైతులు, రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. ఖమ్మం జిల్లాలో మిర్చిబోర్డు ఏర్పాటు చేస్తే రెండు తెలుగురాష్ట్రాల మిర్చి రైతులకు సౌలభ్యంగా ఉంటుందని డిమాండ్ చేస్తున్నారు. మిర్చిబోర్డు డిమాండ్‌తో ఆందోళనలకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ఎకరానికి రూ.25వేలు కౌలు


ఆర్.నాగేశ్వరరావు, కోణిజర్ల



ఎకరానికి రూ.25వేలు చొప్పున రెండు ఎకరాల కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేశా.. ఎకరానికి లక్షన్నర పెట్టుబడి వచ్చింది. దిగుబడి 15క్వింటాళ్లపైనే వచ్చింది. ధర మాత్రం రూ.13వేలు మాత్రమే ఉంది. లాభాలు వస్తాయనుకుంటే పెట్టుబడులు కూడా రావడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

కష్టపడి పండిస్తే ధర ఏదీ ?

బి.శ్రీనివాస్, కూసుమంచి



ఎకరానికి లక్షన్నర పెట్టుబడి పెట్టి మిర్చి పండించా. కానీ మార్కెట్‌లో ధర లేదు. గతేడాది ఇదే సీజన్‌లో క్వింటాకు రూ.18వేలపైగా ధర ఉంది. ఇప్పుడు రూ.13వేలకే పంటను విక్రయించా. మార్కెట్‌లో జెండాపాట రూ.14వేలపైనే చెబుతున్నా కొనేటప్పుడు నాణ్యత లేదని ధర తగ్గిస్తున్నారు. ప్రభుత్వం మిర్చి బోర్డు ఏర్పాటు చేసి ధర పడిపోకుండా రైతులకు న్యాయం చేయాలి. లేదంటే మిర్చి సాగు తగ్గే ప్రమాదం ఉంది. గత ఏడాదికంటే ఈసారి చాలామంది రైతులు మిర్చి సాగును తగ్గించారు.

సింగరేణి విద్యార్థికి ఇన్‌స్పైర్ అవార్డు

మణుగూరు టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ మానక్ అవార్డును మణుగూరు సింగరేణి హై స్కూల్ విద్యార్థి ఎస్‌డీ ఇంతియాజ్ ఎంపికయ్యాడు. 'ఇంక్ ఫ్రం స్మోక్' అనే అంశంలో ఇంతియాజ్ ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం ఈ అవార్డుకు ఎంపిక చేసింది. వివిధ రకాలైన సైన్స్ ప్రాజెక్టులు వర్కింగ్ మోడల్ తయారీ కోసం రాష్ట్ర ప్రభుత్వ రూ. 10వేలు ఇంతియాజ్‌కు సహాయం చేసింది. వాటిని రాష్ట్ర జాతీయ స్థాయిలో ప్రదర్శించడానికి కూడా అవకాశం కల్పించారు. గురువారం సింగరేణి ఉపాధ్యాయ బృందం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఇంతియాజ్‌ను అభినందించారు. హెచ్‌ఎం ఈజి స్వరూప రాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



భక్తులు మెచ్చేలా ఏర్పాట్లుండాలి

(5వ పేజీ తరువాయి)

ఆర్‌అండ్‌బీ పోలీసు శాఖ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని బారికేడ్లు పటిష్టంగా నిర్మించాలని నాసిరకంగా బారికేడ్ల నిర్వహణ చేస్తే ఏజెన్సీలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలని, అలాగే విధులు నిర్వహించే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. ఐటీసీ ద్వారా చేపట్టే తాత్కాలిక టాయిలెట్లు ఈ నెల 31 వరకు పూర్తయ్యేలా చూడాలన్నారు. మంచినీటి సరఫరా విషయంలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని, మంచినీటి పరీక్షల నిర్వహణకు సిబ్బందిని నియమించాలన్నారు. గోదావరిలో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని, భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా మైకుల ద్వారా హెచ్చరించే విధానం అమలు చేయాలన్నారు. కల్యాణ మండప పరిసరాల్లో భక్తుల రద్దీ నియంత్రణకు మూడంచెల భద్రత ఏర్పాట్లు చేయాలని, అందుకు పోలీసు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రధాన ఆస్పత్రిలో 20 బెడ్లను సిద్ధంగా ఉంచాలని, అలాగే ఐసీయూ వార్డు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసరమైన మందులన్ని సిద్ధంగా ఉంచాలని ప్రత్యేకంగా వైద్యాధికారులకు సూచించారు. అనంతరం ఐటీడీఏ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 24 గంటలు అందుబాటులో ఉండి పారిశుధ్య కార్యక్రమాలు చేయిస్తామని, తాత్కాలిక టాయిలెట్ల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూస్తామన్నారు. కల్యాణం, పట్టాభిషేకం ముగిసే వరకు ఐటీడీఏ కార్యాలయంలోని యూనిట్ అధికారులను అప్రమత్తంగా ఉంచి సక్రమంగా విధులు నిర్వహించేలా చూస్తామని పేర్కొన్నారు. అనంతరం 8న జరిగే మహిళ దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.


సమీక్షకు హాజరైన అధికారులు

రెండువేల మందితో బందోబస్తు ఎస్పీ రోహిత్‌రాజు

శ్రీసీతారామచంద్రస్వామి వారి కల్యాణం, పట్టాభిషేకం విజయవంతంగా జరిగేలా పోలీసు శాఖ తరపున రెండువేల మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

భక్తులకు సహాయ సహకారాలు అందించే విధంగా కృషి చేస్తామని, పార్కింగ్ స్థలాలు, భక్తులు సేద తీరే ప్రదేశాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, డీఆర్‌డీవో విద్యాచందన, ఆర్డీవోలు దామోదర్‌రావు, మధుసూదన్, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జల బంధం

(5వ పేజీ తరువాయి)

డీఈ చంద్రశేఖర్ పర్యవేక్షిస్తున్నారు. జూలూరుపాడు మండలానికి గోదావరి జలాలు రావడంతో కొన్ని గ్రామాల రైతులు పులకించిపోయారు. మెయిన్ కెనాల్ నుంచి తమ పంట పొలాల సమీపంలో నిర్మించిన రాజీవ్‌లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలు ఏన్కూర్ మండలం మీదుగా ఎన్నెస్పీ ఆయకట్టుకు తరలివెళుతున్నాయి.

దాంతో సీతారామ మెయిన్ కెనాల్, రాజీవ్ లింక్ కాల్వల సమీపంలోని నల్లబండబోడు, రామచంద్రాపురం, గుండెపుడి, జూలూరుపాడు, వినోభానగర్ గ్రామాలకు చెందిన రైతులు తమకు సాగునీటి కష్టాలు తీరుతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి తుమ్మల చొరవతోనే ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యి గోదావరి జలాలు మండలానికి చేరుకున్నాయని రైతులు తెలిపారు.


లింక్ కెనాల్ నుంచి ప్రవహిస్తున్న గోదావరి జలాలు

గోదావరి జలాలతో ఎంతో ఉపయోగం

అనమల్ల శ్రీను, జూలూరుపాడు



రాజీవ్ లింక్‌కెనాల్ సమీపంలో నాకు 10 ఎకరాల భూమి ఉంది. ఈ ప్రాంతానికి గోదావరి జలాలు రావటం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. కాల్వ పక్కన పొలాలు ఉన్న రైతులు రెండు పంటలను సాగు చేసుకోవచ్చు. సాగు నీటి ఇబ్బందులు తీరనున్నాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి ఫలితంగానే గోదావరి జలాలు మండలానికి వచ్చినట్లు తామంతా భావిస్తున్నాం.

సాగునీటి కష్టాలు తీరినట్లే..

గుండెపిన్ని అనిల్, రైతు వినోభానగర్



ఎన్నో ఏళ్ల నుంచి సాగునీరు సమృద్ధిగా లేకపోవటంతో పంటలను పండించడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీతారామ కెనాల్ ద్వారా మండలానికి గోదావరి జలాలు రావడంతో రైతులకు సాగునీటి కష్టాలు తీరినట్లే.. స్థానికంగా ఉన్న చెరువుల్లోకి గోదావరి జలాలను తరలించి ప్రతి ఎకరాకు సాగునీటిని అందించాలని కోరుతున్నాం.

వాహనాలను ధ్వంసం చేసిన డీలర్

» వీఎంబంజర్‌లో ఘటన

పెనుబల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వీఎం బంజర్‌లోని హీరో కంపెనీ సంబంధించి సబ్ డీలర్‌కు చెందిన వాహనాలను ధ్వంసం చేసి వర్కర్‌ను గాయపర్చిన ఘటనపై పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఖమ్మం హీరో కంపెనీ డీలర్ ఈశ్వరప్రగడ హరిబాబు అతని కుమారుడు రంగనాథ్‌లు బుధవారం వీఎంబంజర్‌లోని సబ్‌డీలర్ చైతన్యరెడ్డికి చెందిన షోరూమ్‌లో హీరో కంపెనీకి చెందిన ఆరు మోటార్ సైకిళ్లను ధ్వంసం చేయడంతో పాటు కార్మికుడిని గాయపర్చారని పోలీసులకు చైతన్యరెడ్డి ఫిర్యాదు చేశారు. హీరో కంపెనీ డీలర్ తన దగ్గర వాహనాలు కొనుగోలు చేయడం లేదని, తక్కువ రేటుకు మరో డీలర్ వద్ద కొనుగోలు చేయడం ఏంటని దుర్భాషలాడుతూ షోరూమ్‌లో నుంచి వాహనాలను తెచ్చి ధ్వంసం చేసి బీభత్సం చేశారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బోధనపై పట్టు సాధించేలా...

» భద్రాద్రి జిల్లా నూతన స్కూల్ అసిస్టెంట్లకు ఖమ్మంలో ముగిసిన శిక్షణ


శిక్షణలో పాల్గొన్న భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఉపాధ్యాయులు

కొత్తగూడెం అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నూతన ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన బోధన చేసేందుకు అవసరమైన శిక్షణను విద్యాశాఖ అధికారులు అందిస్తున్నారు. ఉపాధ్యాయ శిక్షణ పూర్తిచేసి డీఎస్సీ - 2024లో 413మంది గురువులుగా కొలువుదీరిన వారికి విద్యా బోధనలో అమలవుతున్న నూతన సంస్కరణలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువులో సామర్థ్యాలు చూపేలా తీర్చిదిద్దేందుకు ఉమ్మడి జిల్లా స్కూల్ అసిస్టెంట్లకు ఖమ్మంలో ఏర్పాటుచేసిన ఈ శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఫిబ్రవరి 28నుంచి మార్చి 3 వరకు మూడురోజుల పాటు విడతల వారీగా శిక్షణను ఇచ్చారు. జిల్లాలో 256 మంది ఎస్జీటీలుగా నియామకమైన ఉపాధ్యాయులకు కొత్తగూడెం జిల్లా విద్యాశిక్షణ కేంద్రంలో శిక్షణ తరగతులు పూర్తిచేశారు. జిల్లాలో నియామకమైన 114మంది స్కూల్ అసిస్టెంట్లు, 9మంది ల్యాంగేజ్ పండిట్లు, 1 పీఈటీలకు ఈనెల 4నుంచి 6వరకు ఖమ్మంలో నయాబజార్, ప్రభుత్వ బాలికల పాఠశాల, ప్రభుత్వ జీహెచ్ఎ రాజేంద్రనగర్‌లో శిక్షణ తరగతులు పూర్తయ్యాయి. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (టీపీఐఆర్‌డీ) 8మంది స్కూల్ అసిస్టెంట్లు ఫిజిక్స్ వారికి శిక్షణను ఫిబ్రవరి 28నుంచి మార్చి 3వరకు శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర విద్యాపరిశోధన సంస్థలో శిక్షణ పొందిన సబ్జెక్టుకు ముగ్గురు రిసోర్స్‌పర్సన్లు వీరికి శిక్షణ ఇచ్చారు. పాఠ్యాంశాల వారీగా బోధన మెలుకువలను నేర్పించారు.

జిల్లాలో నూతనంగా ఎంపికైన అన్ని విభాగాల ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలు చాటేలా బోధనలో పట్టు సాధించేందుకు ఈ శిక్షణ అందించారు. పాఠ్యపుస్తకాలు సమర్థంగా వినియోగం, తరగతి గది ప్రక్రియలు, విద్యాప్రమాణాలు అభ్యసన ఫలితాలు, నాణ్యమైన విద్యఅందించేందుకు ఆయా పాఠ్యాంశాల్లో అవగాహన పెంచేలా శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చదువుల్లో రాయడంలో ముందజలో ఉండేలా తీర్చిదిద్దేందుకు ఈ శిక్షణ దోహదపడనుంది.

ఘనంగా నాగవెల్లి జాతర

» మాడిమోరి గుట్ట నుంచి గద్దెలపైకి చేరిన సమ్మక్క
» శివసత్తుల పూనకాలతో స్వాగతం పలికిన భక్తజనం


మాడిమోరి గుట్ట నుంచి వనం తీసుకువస్తున్న భక్తులు

గుండాల, మార్చి 6: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం వేపలగడ్డ గ్రామానికి చెందిన అరెం వంశీయుడు పగడిద్దరాజు నాగవెల్లి జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. బుధవారమే పగడిద్దరాజును గద్దెకు చేర్చగా, గురువారం వనం(సమ్మక్క) గద్దెలకు చేరడంతో నిండు జాతర మొదలైంది. జనంలోకి అడుగిడిన వనదేవత సమ్మక్కకు భక్తులు జయహో సమ్మక్క తల్లి అంటూ ఆనంద పారవశ్యంతో స్వాగతం పలికారు. కుంకుమ భరిణ రూపంలోని సమ్మక్క తల్లి మాడిమోరి గుట్ట నుంచి వనం జనంలోకి అడుగిడింది. పెళ్లికాని అమ్మాయిలు, యువకులు, అనారోగ్యంతో బాధపడుతున్న భక్తులు వరం పట్టారు. తోటివాగులో నేలపై పడుకోని వారి పైనుంచి సమ్మక్క వెళ్తే శుభం కలుగుతుందని విశ్వాసంతో సాష్టాంగ ప్రణమిల్లారు. ఈ క్రమంలోనే పెళ్లి కుమారుడిగా ముస్తాబైన అరెం వశీయుడు పగడిద్దరాజు వనం బాటపట్టారు. సమ్మక్కకు ఎదురెళ్లి ఆదివాసీ సంప్రదాయాల నడుమ సమ్మక్క పగడిద్దరాజులకు వివాహం జరిపించారు. గిరిజన నృత్యాలతో సంప్రదాయ డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుతో గద్దెలపైకి చేర్చి ప్రతిష్ఠించారు. పూజారులు, వడ్డెలు, తలపతులు అప్పయ్య, నాగయ్య, భిక్షం, బుచ్చయ్యలు దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం జోగుకు కార్యక్రమం నిర్వహించారు. రాత్రి దేవతలకు గంగా స్నానం చేయించి గుడినింపారు. దేవతలను దర్శించుకున్న భక్తులు బెల్లం, కొబ్బరికాయలను సమర్పించుకున్నారు. నిర్వాహకులు అరెం లచ్చుపటేల్, లక్ష్మీనర్సు, కాంతారావు, చిన్న కాంతారావు, లక్ష్మయ్య, సమ్మయ్య, సత్యం, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు, గుండాల సీఐ రవీందర్, ఎస్ఐ రాజమౌళి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


పూజలు చేస్తున్న భక్తులు

మేడారం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ అరెం లచ్చుపటేల్ వన దేవతలు పగడిద్దరాజు, సమ్మక్కను దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర లు గిరిజన సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. ఆదివాసీల పురోగతికి పాటుపడుతామని అన్నారు.

ఉన్నట్టా..లేనట్టా

» నెలన్నర రోజులుగా తెరుచుకోని అశ్వారావుపేట ఎంవీఐ కార్యాలయం


తాళం వేసి ఉన్న మోటారు వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం

అశ్వారావుపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటలో ఏర్పాటు చేసిన మోటారు వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం నెలన్నరోజులుగా తాళాలు తెరుచుకోకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. రిజిస్ట్రేషన్‌లు ఇతరత్రా పనుల కోసం ప్రజలు జిల్లా కేంద్రమైన కొత్తగూడెంకు వెళ్లాలసి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వారం అయిన రాకపోతారా అంటూ పలువురు వాహనదారులు అశ్వారావుపేటలోని మోటారు వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్దకు వచ్చి మధ్యాహ్నం వరకు వేచి చూడటం, ఇన్‌స్పెక్టర్ రావడం లేదంటూ సిబ్బంది తెలపడంతో కార్యాలయం వద్ద పడిగాపులు కాసిన వాహనదారులు ఉసూరుమంటూ వెనుతిరిగి పోవడం పరిపాటిగా మారింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పడిన తరువాత వాహనాల రిజిస్ట్రేషన్‌లు, డ్రైవింగ్ లైసెన్సులు, రెన్యూవల్స్, బ్రేక్ వంటి పనులు చేయటానికి 75 కి.మీ. దూరంలో ఉన్న జిల్లా కేంద్రానికి వెళ్ల వలసి వచ్చేది. దీంతో అంత దూరం వాహనదారులు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర అవ్వడంతో అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా అశ్వారావుపేటలో మోటారు వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం అశ్వారావుపేటలో ఏర్పాటు చేశారు. అయితే ప్రతి గురువారం ఒక్క రోజు అశ్వారావుపేటలోని ఈ కార్యాలయం పనిచేస్తుంది. అశ్వారావుపేట, దమ్మపేట మండలాలకు చెందిన వాహనాలు ఇక్కడే రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ చేస్తారు. ప్రతి వారం వందకుపైగా వాహనాలు వస్తుంటాయి. చాలా కాలం బాగానే నడిచినప్పటి నుంచి కొన్నాళ్లుగా రెండు వారాలకోసారి ఈ కార్యాలయం తెరవడం ప్రారంభించారు. దీంతో పెద్ద ఎత్తున వాహనాల రిజిస్ట్రేషన్‌లు పేరుకొని పోయేవి. అత్యవసరమైన వారుంటూ కొత్తగూడెం పంపించమని చెబుతుండటంతో ఇక్కడ కార్యాలయం ఉన్న ప్రజలకు సౌకర్యం లేకుండా పోయింది. కొత్తగూడెం వెళ్లాలంటే సమయంతో పాటు ఆర్థికంగా వాహనదారులకు భారంగా మారుతుంది. అయితే గత నెలన్నరరోజులుగా ఈ కార్యాలయం తలుపులు అస్సలు తెరుచుకోనేలేదు. దీంతో ప్రతి గురువారం వాహనదారులు వచ్చి వెళ్లడం పరిపాటిగా మారింది. మీడియాను చూసిన వాహనదారులు నెలన్నరరోజులుగా ఈ కార్యాలయం తెరవడం లేదని తెలిపారు. దీనిపై ఆర్టీఏ మనోహర్‌ను వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. ఇప్పటికైనా అధికారులు ప్రతి గురువారం అశ్వారావుపేట కార్యాలయాన్ని నడిచేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

భద్రాద్రి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఏర్పాటు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): నూతన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ గురువారం ఏర్పడింది. సీనియర్ శిక్షకుడు బండారి ఎల్లయ్య సహకారంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఏర్పాటుకు తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ వారిచే అఫిలియేషన్ అయ్యి ఈ నూతన కమిటీ ప్రకటించారు. వీరిలో భద్రాద్రి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సంఘ చైర్మన్‌గా లగడపాటి రమేష్, అధ్యక్షుడిగా ఉదయ్‌కాంత్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎం.రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా వై.శివ సుబ్రహ్మణ్యం, ముఖ్య సలహాదారులుగా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కె.సంజీవరావు, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ అధికారి సంఘం వెంకట పుల్లయ్య, టిఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు అమరనేని రామారావు, ఎల్డా జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, చీఫ్ పాట్రన్‌గా హైకోర్టు అడ్వకేట్ యెర్రా కామేష్, జవహర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా షమివుద్దీన్, శ్రీకాంత్, రమేష్, శంకర్‌గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఈశ్వర్, జాయింట్ సెక్రటరీగా దారా నగేష్, అరుణ్‌కుమార్, కన్నయ్య, శ్రీమూర్తులు, లీగల్ అడ్వైజర్‌గా మారపాక రమేష్, ట్రెజరర్‌గా రవీందర్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్స్‌గా మహేందర్, రతన్‌సింగ్, దుర్గ, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, నవీన్ యశ్వంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మేక పిల్ల ఆకలితీర్చిన శునకం

చంద్రుగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సృష్టిలో తీయనిది తల్లి ప్రేమ పేగు తెంచుకుని కన్న బిడ్డలను ఆదరించి లాలించడం పరిపాటే కానీ తల్లి ఇచ్చే పాలు సరిపోక అల్లాడుతున్న మేక పిల్లను వేరే జాతికి చెందిన శునకం అక్కున చేర్చుకుని నిత్యం తన పాలను పంచుతుంది. ఈ విభిన్న మాతృత్వం ఘటన చంద్రుగొండ మండలం మంగయ్యబంజర్ గ్రామంలో నునావత్ హేమ్లు అనే మేకల కాపరి ఇంట్లో చోటు చేసుకుంది. హేమ్లా తన మేకలను రోజు మేతకు తోలుకు పోతుంటా డు. కుక్కను సైతం మేకలకు రక్షణగా తనతో పాటు ఉంచుకుంటాడు. ఈ క్రమంలో ఒక మేకకు మూడు పిల్లలు జన్మించాయి. దీంతో మూడు పిల్లలకు సరిపోను పాలు మేక అందించ లేక పోతుంది. ఇది రైతు హేమ్లా గుర్తించలేదు కానీ ఎప్పుడు మే కల వెంటే ఉండే కుక్క పసిగట్టింది. కాగా కుక్క కూడా ఇటీవలే పిల్లలకు జన్మనిచ్చింది విభిన్న జీవి అయినా అక్కున చేర్చుకొని పాలు అందిస్తూ మాతృత్వాన్ని పంచుతున్న మూగ జీవిని చూచి నేటి మనిషి నేర్చుకోవాల ని ఈ ఘటన చూచిన వారు వ్యాఖ్యానిస్తున్నారు.


మేకపిల్లకు పాలు ఇస్తున్న శునకం

10 నుంచి ఎఫ్ఎన్ఎల్ ఎస్ఎస్‌మెంట్ సర్వే

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 10 నుంచి 12 వ తేదీ వరకు జరిగే ఎఫ్ఎన్ఎల్(ఫౌండేషన్ లిటరసి అండ్ న్యూమరాసి)ఎస్ఎస్‌మెంట్ సర్వే ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. గురువారం నగరంలోని డైట్ కళాశాలలో సర్వేలో పాల్గొనే ఫిల్డ్ ఇన్‌స్ట్రక్టర్స్‌కు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్‌గా ప్రిన్సిపాల్ సత్యనారాయణ వ్యవహరించారు. ఏఎంవో రవికుమార్ అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అనిల్‌కుమార్, వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

12న పాత పార్శిళ్ల వేలం

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కొత్త బస్టాండ్‌లో గల కార్గో పార్శిల్స్ కొరియర్ సర్వీస్ కౌంటర్‌లో తీసుకెళ్లని వస్తువులను ఈ నెల 12న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాల లాజిస్టిక్ మేనేజర్ రామారావు గురువారం ప్రకటనలో తెలిపారు. ముందస్తు డిపాజిట్ లేకుండానే ఈ వేలంలో ఎవరైనా పాల్గొనవచ్చునని తెలిపారు.

ప్రాణం తీసిన అనుమానం

» భార్యతో వివాహేతర సంబంధం ఉందని చితక బాదిన భర్త
» చికిత్స పొందుతూ యువకుడి మృతి



దమ్మపేట, మార్చి6 (ఆంధ్రజ్యోతి): తన భార్యతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో ఓ యువకుడిని ఆమె భర్త చితక బాదటంతో చికిత్స పొందుతూమృతి చెందాడు. ఈ ఘటన దమ్మపేట మండలం అర్లపెంటలో జరిగింది. దమ్మపేట పోలీసుల వివరాల ప్రకారం... పట్వారిగూడెం గ్రామానికి చెందిన సున్నం శివ (28) అనే యువకుడు ఆటోనడుపుతున్నాడు. ఆటోడ్రైవర్ల సమావేశం బుధవారం ఆర్లపెంట గ్రామ సమీపంలో నిర్వహించగా అక్కడకు వెళ్లాడు. సమావేశం అనంతరం ఆర్లపెంటలో తన స్నేహితుడు డబుల్ బెడ్‌రూమ్ గృహాలవద్ద ఉండటంతో అక్కడుకు వెళ్లాడు. శివను అక్కడ చూసిన వగ్గెల శ్రీను అనే వ్యక్తి తనభార్యతో వివాహేతర సంబంధం ఉందని అందుకే వచ్చావంటూ దూషించాడు. ఇరువురి మధ్య మాటామాటా పెరగటంతో అందుబాటులో ఉన్న ఇనుపరాడ్‌తో శ్రీను బలంగా కొట్టాడు. దీంతో గ్రామస్థులు శ్రీనును అడ్డుకుని శివ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శివను పట్వారిగూడెంలో ప్రాథమిక వైద్యశాలలో చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శివ గురువారం మృతి చెందాడు. మృతుడి సోదరి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

మావోయిస్టులకు సహకరించొద్దు

» భద్రాద్రి ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్
» చర్లపోలీస్‌స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగాం


మాట్లాడుతున్న ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

చర్ల, మార్చి6 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీకి సహకరించవద్దని, గ్రామంలో కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఏజెన్సీ గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. గురువారం చర్ల మండలపరిధిలోని ఒట్టిగూడెం, రామచంద్రాపురంలో పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగామ్ నిర్వహించారు. ఏఎస్పీ ప్రతీ ఇంటిని సందర్శించారు. చిన్నారుల ఆరోగ్యం, చదువుపై ఆరా తీశారు. ఏజెన్సీవాసుల హక్కులను రక్షించేందుకు పోలీసులు నిరంతరం గ్రామస్తులకు అందుబాటులో ఉంటారన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్న పోలీసు శాఖ తరుపున సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో యువత భాగస్వాములు కావాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్ కుమార్, చర్ల సీఐ రాజు వర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు

కరకగూడెం: గురువారం రాత్రి మండలంలోని వలస ఆదివాసీ గ్రామాలైన రేగళ్ళ, పడిగాపురం, అంగారుగూడెం, లిమ్మగూడెం, కొత్తూరు, నీలాద్రిపేట, అశ్వాపురంపాడు గ్రామాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు వెలిశాయి. దీంతో మారుమూల గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల మండలంలోని రఘునాథపాలెం అడవీలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. కాగా మండలంలోని అడవీ ప్రాంతంలో గ్రైహోండ్స్ బలగాలు ముమ్మరంగా గాంలింపు చర్యలు చేపడుతుండటంతో ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

రియల్‌ఎస్టేట్ వ్యాపారిపై కేసు

నిందితుడు పశుసంవర్ధక శాఖలో డీడీ

ఖమ్మంక్రైం, మార్చి6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం అర్బన్ వెలుగుమట్లప్రాంతంలో నాలుగు ఎకరాల భూమిలో 24 నెలల్లో అపార్టుమెంట్ నిర్మించి ఇస్తామని బాధితులను నమ్మించి మోసం చేసిన రియల్‌ఎస్టేట్ వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు టుటౌన్ సీఐ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పశుసంవర్ధకశాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటనారాయణ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ పలువురు నుంచి అపార్టుమెంట్ నిర్మిస్తానని డబ్బులు తీసుకున్నాడు. వెలుగుమట్ల లోని 546 సర్వేనెంబరులో అపార్టుమెంట్ నిర్మిస్తానంటూ మోసం చేశాడు. దీంతో ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురానికి చెందిన మారుపాక వెంకటాచారిఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఇల్లెందు, మార్చి6(ఆంధ్రజ్యోతి): మండలంలో నిజాంపేటలో గురువారం సాయంత్రం వర్సా సాగర్(25) ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి మూడు నెలల క్రితం వివాహం జరిగింది. అనారోగ్య కారణాలు, కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేయడంతో సమాచారం అందుకున్న పోలీసులు నిజాంపేట చేరుకొని పోస్టుమార్టం చేయాలని అంత్యక్రియలు నిలిపివేశారు.

తాళాలు పగులకొట్టి ఇంట్లో చోరీ

భద్రాచలం, మార్చి6 (ఆంధ్రజ్యోతి):భద్రాచలంలోని సీతారామనగర్ కాలనీలో కె.వెంకటేశ్వరరావు ఇంట్లో బుధవారం ఇంటి తాళాలు పగలకొట్టి ఓ దొంగ చోరీకి పాల్పడ్డాడు. వెంకటేశ్వరరావు భాగ్యలక్ష్మి దంపతులు విజయవాడకు వెళ్లడంతో వారు లేని సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. బుధవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ముఖానికి మాస్కు, చేతికి గ్లౌజ్‌లు పెట్టుకొని ఇంటితాళాలను పగలకొట్టి లోపలికి వెళ్లినట్లు సీసీ టీవీ ఫుటేజీలో రికార్డు అయ్యింది. ఈ సమయంలో ఆదొంగ లైటు వేసి గదిలో గంటకు పైగానే ఉన్నట్లు తెలుస్తోంది. చోరీ జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సైవిజయలక్ష్మి సంఘటనా స్థలానికి క్లూస్ టీంతో వెళ్లి ఆధారాలను సేకరించారు. కాగా బాధిత కుటుంబ సభ్యులకు చెందిన రూ.5 వేలు, చెవిదిద్దులు,నల్లపూసల లాకెట్, పగడం, చైను చోరీకి గురైనట్లు పేర్కొన్నారు.

రూ.35 లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మంలీగల్,మార్చి6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన మేడబోయిన వేణు రూ.35లక్షల 20వేలలకు దివాళా పిటీషన్ దాఖలుచేశాడు.ఫిర్యాది దారుడు కిరాణం వ్యాపారం చేసేవారు. వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి అధిక వడ్డీలకు ఫైనాన్స్ సంస్థలు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక మొత్తంలో అప్పులు చేశాడు.వ్యాపారంలో తీవ్రంగా నష్టం రావటంతో రుణ దాతలనుంచి వత్తిడి తీవ్రమైంది. గత్యంతరం లేక మొత్తం 22 మందిని ప్రతివాదులుగా చేరుస్తూ తన న్యాయవాది అయిన జె.గోవిందరావు ద్వారా సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం దివాళా పిటీషన్ దాఖలు చేశారు. తమను దివాళా దారులుగా ప్రకటించమని పిటీషన్లో కోర్టును అభ్యర్థించాడు.

బాధితులకు న్యాయం చేకూరేలా చర్యలు చేపట్టాలి

» బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన భద్రాద్రి ఎస్పీ


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

బూర్గంపాడు,మార్చి6(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఎస్పీ రోహిత్‌రాజు సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలుసూచనలు చేశారు. బాధితులతో మాట్లాడిన ఎస్పీ వారి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే విచారణ చేపట్టి న్యాయం చేకూరేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో పని చేసే సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్‌పై ప్రజల్లో చైతన్యం తీసు కొచ్చేందుకు ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ నాగరాజు, బూర్గంపాడు ఎస్ఐ రాజేష్, అదనపు ఎస్ఐ నాగభిక్షం పాల్గొన్నారు.

తల్లాడలో పరుపుల ఫ్యాక్టరీ దగ్ధం

తల్లాడ, మార్చి6(ఆంధ్రజ్యోతి): తల్లాడలోని పస్తం మద్దిరామయ్య(పీఎంఆర్) పరుపుల ఫ్యాక్టరీలో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రూ.30లక్షల ఆస్తినష్టం జరిగింది. సాయంత్రం సమయంలో అకస్మాత్తుగా ఫ్యాక్టరీలో మంటలు వ్యాప్తి చెంది షెడ్‌తోపాటు మిషనరీ, పరుపుల తయారీ సామగ్రి, పరుపులు, మినీవ్యాన్ దగ్ధమయ్యాయి. ప్రమాద సమయంలో స్థానికులు సంఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించినప్పటికీ అదుపులోకి రాలేదు. వైరా నుంచి ఫైరింజన్ వచ్చే సమయానికే పరుపుల ఫ్యాక్టరీ కాలి బూడిద అయింది. ఈ ప్రమాదంలో రూ.30లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగినట్లు నిర్వాహకుడు పస్తం మద్దిరామయ్య తెలిపారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చునని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



'నకిలీ డాక్యుమెంట్లతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు'

ఖమ్మంరూరల్,మార్చి6(ఆంధ్రజ్యోతి): పాల్వంచకు చెందిన పావురాల కృష్ణ నా భూమి నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఖమ్మం రూరల్ మండలం, ఆరెంపుల గ్రామానికి చెందిన బొడ్డు నాగేశ్వరరావు ఆరోపించారు. మండల పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఆరెంపులలో ఎకరన్నర భూమిని పాల్వంచకు చెందిన పావురాల కృష్ణ కుటుంబ సభ్యుల నుంచి 2002లో మా తండ్రి బొడ్డు శేషయ్య కొనుగోలు చేశారన్నారని, భూమికి వారసులుగా ఉంటే పావురాల కృష్ణ, తన అనుచరులు దాడులు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. న్యాయం చేయాలని విన్నవించారు.



పెళ్లికి హాజరైన అతిథులకు మొక్కల పంపిణీ

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన పర్యావరణమిత్ర జాతీయ అవార్డు గ్రహీత కడవెండి వేణుగోపాల్ వివాహం మార్చి 2న హైదరాబాదులో జరిగింది. ఈ వేడుకల్లో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పూర్తిగా నివారించడంతో పాటు హాజరైన అతిథులకు మొక్కలు అందించామని వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. వివాహ వేడుకలు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే విధంగా వివాహ వేడుకలు నిర్వహించినందుకుగాను పలువురు ప్రముఖులు ప్రశంసించారని తెలిపారు.

డిగ్రీ ఫలితాలు విడుదల చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి6(ఆంధ్రజ్యోతి):కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ కోర్సుల డిగ్రీ మొదటి, మూడు, ఐదోసెమిస్టర్ ఫలితాలు మంగళవారం విడుదల కాగా నిలిపివేసిన కళాశాలల్లోని సెమిస్టర్‌ఫలితలు తక్షణం విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్, డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయానికి డీన్ అకడమిక్ ఆడిట్‌కు బకాయిలు చెల్లించకపోవడం వల్లే ఫలితాలు నిలిపివేయడం దారుణమన్నారు. కేయూ పరిధిలోని 304 డిగ్రీ కళాశాలలుంటే కొన్ని కాలేజీ యాజమాన్యాలు బకాయిలు చెల్లించని 117 కళాశాలల విద్యార్థుల సెమిస్టర్ ఫలితాలునిలిపివేయడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు.

ఎస్‌బీఐటీ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి6 (ఆంధ్రజ్యోతి): గురువారం ప్రకటించిన జేఎన్‌టీయూ తృతీయ ఏడాది ఇంజనీరింగ్ ఫలితాలలో ఎస్‌బీఐటీ కళాశాల డేటాసైన్సు విద్యార్థిని నూనే ప్రియంవద సహస్వి 9.5 రాష్ట్రస్థాయి ఎస్‌జీపీఏ సాధించిందని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మొత్తం 12మంది విద్యార్థులు 9ఎస్‌జీపీఏ సాధించారని తెలిపారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి

పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

తిరుమలాయపాలెం, మార్చి6(ఆంధ్రజ్యోతి): విద్యారంగానికి బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించి పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజురియింబర్సుమెంట్ విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లాప్రధాన కార్యదర్శి జి.మస్తాన్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పిండిప్రోలులో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సంక్షేమహాస్టల్స్ గురుకులాకు సొంతభవనాలు ఏర్పాటుచేయాలన్నారు. ఈకార్యక్రమంలో గాంధీ, రాజేష్, మల్లేష్, అఖిల్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం



ఉత్సవ విగ్రహాలను పీటల మీదకు తీసుకు వస్తున్న దృశ్యం

కామేపల్లి,మార్చి6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాళ్ల గూడెంలోని శ్రీగోపయ్య సమేత లక్ష్మితిరుపతమ్మ అమ్మవారి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భారీగా భక్తజనం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల వెంకటేశ్వర్లు, పుచ్చకాయల క్రిష్ణయాదవ్, బాబు, పుచ్చకాయల కోటయ్య, చిన్నవెంకటేశ్వర్లు, నర్సయ్య, నాగేశ్వరరావు, వెంకటక్రిష్ణ, క్రిష్ణ, ఉదయ్‌కిరణ్, వంశీ, తుపాకుల రమేష్ పాల్గొన్నారు.

పరిశీలనాత్మకంగా తొలిరోజు పర్యటన

- పుణెలో మూలమత్త నది, ఎస్‌టీపీ సెంటర్ల పనితీరు అధ్యయనం
- ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగిన కార్పొరేటర్ల పర్యటన



పుణె మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్‌తో కేఎంసీ బృందం

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి6(ఆంధ్రజ్యోతి): పుణెలో ఖమ్మం కార్పొరేటర్ల పర్యటన పరిశీలనాత్మకంగా సాగుతోంది. పట్టణాభివృద్ధి అధికారుల సూచనల మేరకు ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రతిష్టాత్మకమైన మూలమత్త నది పరిశీలన, ఎస్‌టీపీ సెంటర్ నిర్వాహణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పుణెలో 35కిమీ దూరం వరకు మూలమత్త నది ప్రయాణిస్తుంది. దశాబ్దాలుగా అక్రమణలకు గురై శ్మశాన వాటికలు ఏర్పడ్డాయి. ఫలితంగా నదికి వచ్చిన వరద పుణెను ముంచెత్తేది. దీంతో పదేళ్ల క్రితమే మూలమత్త నది ప్రక్షాళన కార్యక్రమం ప్రారంభించారు. 2005లో అండర్‌గ్రౌండ్ డ్రేనేజీ(యూజీడీ)ద్వారా వ్యర్థాలు నదిలోకి వెళ్లకుండా ఏర్పాట్లు చేశారు. తర్వాత ఎస్‌టీపీ (సివిరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను ఏర్పాటు చేసి మురుగు నీరును శుద్ధి చేసి వాటిని రిజర్వాయర్‌లో వదులుతూ నివాసాలకు నర్సరీలు, పార్కులు, వ్యవసాయానికి, తాగునీటి ఇతర పథకాలకు వాడుతున్నారు. 48లక్షల జనాభా ఉన్న పుణెలోని 100 ఏళ్ల నీటి వరద తీవ్రత పరిశీలించి నదీ పరిరక్షణ కోసం వరద నీటి రక్షణ గోడలు కట్టారు. నీటిని శుద్ధి చేసిన తర్వాత వచ్చిన వ్యర్థాలను ఎరువులుగా మార్చి వ్యవసాయ అవసరాలకు, పార్కుల నిర్వహణకు వినియోగిస్తున్నారు.

115 ఎంఎల్‌డీ నాయుడు ట్యాంక్ పరిశీలన

పుణెలో రోజుకు 25లక్షల మెట్రిక్ వ్యర్థాలు ఉత్పత్తి జరుగుతున్నాయి. వాటిలో 95శాతం మేరకు ఏ రోజు చెత్త అదేరోజు శుద్ధి చేస్తారు. ఇక్కడ డంపింగ్ యార్డు లేకుండానే చెత్త శుద్ధి జరుగుతుంది. ఘన, ధ్రువ, మల వ్యర్థాలను కలెక్ట్ చేసి వాటిని ఎరువులుగా మార్చి రైతులకు వ్యవసాయ అవసరాలకు వినియోగిస్తున్నారు.

కేఎంసీ బృందానికి పీఎంసీ అధికారులు సన్మానం

మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యంలో బృందం సభ్యులు పుణె మున్సిపల్ కార్యాలయం వరకు వెళ్లగా అధికారులు గులాబీ పూలు అందించి స్వాగతం పలికారు. తర్వాత పీఎంసీ అసిస్టెంట్ కమిషనర్, సీనియర ఐఏఎస్ అధికారి పృథ్వీరాజ్, మేయర్ పునుకొల్లు నీరజను సన్మానించారు. తర్వాత గంటన్నర పాటు పీఎం అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రతీఆరు నెలలకోసారి పారిశుధ్య కార్మికులకు వేతనాల రివిజన్ చేస్తున్నామని, ఒక చెట్టును అభివృద్ధి కోసం తొలగిస్తే ఆ చెట్టుకు బదులుగా మూడు మొక్కలు నాటుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజ ఖమ్మం నగర పాలక సంస్థలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. 41మంది కార్పొరేటర్లతో పాటుగా ఏఎంసీ అహ్మద్ షఫీ ఉల్లా, ఈఈ కృష్ణలాల్, ఏవో శివలింగం, టీపీఎస్ నరేశ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

జిల్లా అదనపు న్యాయాధికారి

ఖమ్మంలీగల్, మార్చి6(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని అదనపు జిల్లాన్యాయాధికారి ఉమాదేవి అన్నారు. స్థానిక టీటీడీసీ బిల్డింగ్‌లో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయవాదులకు నిర్వహించిన మహిళా సమస్యలు చట్టాలు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ప్రసంగించారు. ఇంటికి, సమాజానికి వెలుగునిస్తుందని, నేటి మహిళలు అన్నిరంగాల్లో ముందున్నారని, పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. స్త్రీ ఎక్కడ పూజింపబడుతుంతో అక్కడ సిరిసంపదలు వర్ధిల్లుతాయని అన్నారు. ఈ సందర్భంగా మహిళా న్యాయాధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు అపర్ణ, విద్యుల్లత,అర్చనకుమారి, ఎం.కల్పన, వి.శివరంజని, కే.దీప, వై.బిందుప్రియ, బి.రజిని, వీ.మాధవి, రాంప్రసాద్, మురళీమోహన్, ప్రభాకర్, చంద్రశేఖరరావు, కార్తీక్, ఐలు బాధ్యులు కొల్లి సత్యనారాయణ, ఎం.శ్రీనివాస్, వై.శ్రీనివాస్, నాగేశ్వరరావు, నవీన్, శ్రీలక్ష్మీ, రామలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కరుణగిరి రోడ్డు డివైడర్ల మరమ్మతులు

- మంత్రి తుమ్మల ఆదేశంతో కదలిక
- శ్రీ రామనవమిలోగా పూర్తి చేయాలని ఆదేశం

ఖమ్మంరూరల్,మార్చి6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ మండలం, కోదాడ క్రాస్ రోడ్డు నుండి కరుణగిరి రోడ్డు వరకు ఉన్నటువంటి డివైడర్లు దెబ్బతిన్నాయని వాటి మరమ్మత్తు పనులను శ్రీ రామ నవమి లోపు పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బి అధికారులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఆదేశాలు జారీచేశారు. మంత్రి తుమ్మల ఆదేశాల కనుగుణంగా రహదారులు, సర్కిళ్లు, డివైడర్లు రిపేర్ పనులు మొదలయ్యాయి. పూర్తయిన డివైడర్లు, సర్కిళ్లలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేలా, మొక్కలు నాటేలా, పెయింటింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఏదులాపురం మున్సిపల్ కమిషనర్, ఖమ్మం కలెక్టర్‌ను మంత్రి తుమ్మల ఆదేశించారు. అలాగే ఖమ్మం బ్యూటిఫికేషన్ కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని హైదరాబాద్ సిటి బ్యూటిఫికేషన్ ఇంఛార్జి కృష్ణ, ఐఎఫ్‌ఎస్‌ని కోరడం జరిగింది. శ్రీ రామనవమి వరకు ఖమ్మం నుండి భద్రాచలం వెళ్లే రోడ్డు మరియు ఖమ్మం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్ది, భక్తులకు మరియు వాహనదారులకు అహ్లాద వాతావరణాన్ని కల్పించాలన్నారు. ఆధునిక హంగులతో డివైడర్లను సుందరీకరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల ఆదేశించారు.

కామన్ సర్వీస్ సెంటర్లతో విస్తృత సేవలు

- జిల్లా రెవెన్యూ అధికారి పద్మశ్రీ

ఖమ్మంకలెక్టరేట్, మార్చి6(ఆంధ్రజ్యోతి): కామన్ సర్వీస్ సెంటర్లతో ప్రజలకు విస్తృతంగా సేవలు అందించాలని జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ.పద్మశ్రీ అన్నారు. గురువారం ఆమె కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్ వర్క్‌షాప్‌ను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి గ్రామస్థాయిలో తీసుకుని వెళ్లేందుకు, గ్రామాలలో డిజిటల్ సేవలు మెరుగుపరచడానికి, ఆర్థిక ప్రగతి ఈ గవర్నెన్స్ అందించేందుకు కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోని 10జిల్లాలలో పైలెట్ ప్రాజెక్టు క్రింద ఈ కార్యక్రమం అమలు చేస్తుండగా, ఖమ్మం జిల్లా దీనికి ఎంపికయ్యిందన్నారు. ఖమ్మంలోని 589 గ్రామపంచాయతీలలో ఇప్పటికే 434 కామన్ సర్వీస్ సెంటర్లఏర్పాటు చేసి డిజిటల్‌సేవలు అందిస్తున్నామన్నారు.జిల్లాలో మిగిలిన 155గ్రామాలలో సైతం ఇందిరా మహిళా శక్తి క్రింద మహిళా సంఘాలచే కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేశామని, 68 మంది స్వశక్తి మహిళా సంఘాలను గుర్తించామని, మిగిలిన సెంటర్లకు ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందన్నారు.



సర్టిఫికెట్లు అందస్తున్న జడ్పీ సీఈవో దీక్షరైనా

అనంతరం వారికి ధ్రువీకరణ పత్రాలను జడ్పీ సీఈవో దీక్షరైనా అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో సన్యాసయ్య, ఎస్బీఐ ఆర్ఎం లింగస్వామి, ఎల్డీఎం శ్రీనివాస రెడ్డి, అదనపు డిఆర్డీవో నూరొద్దీన్, సీఎస్సీ రాష్ట్ర హెడ్ కె.సునీల్ రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుహాసిని, టెక్నికల్ టీంసభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో ఇసుక దందా

- పట్టించుకోని పోలీసు, రెవెన్యూ అధికారులు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- తిరుమలాయపాలెం మండలంలో భారీగా ఇసుక వ్యాపారం

తిరుమలాయపాలెం, మార్చి6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధప్రాంతాల్లో అభివృద్ధి పనుల పేరుతో అధికార పార్టీనాయకులు ఇసుక వ్యాపారం కొనసాగిస్తున్నారు. మండలంలోని ఆకేరు, పాలేరు వాగుల నుంచి ఇసుకదందా కొనసాగుతుంది. ఇసుకను అక్రమంగా వివిధ ప్రాంతాలకు తరలిస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. అయితే పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

భారీగా ఇసుక మేటలు

మండలలంలోని ఆకేరు పాలేరు పరివాహక ప్రాంతంలో ఇటీవల భారీవర్షాలతో పెద్దమొత్తంలో ఇసక మేటలు చేరాయి. ముజాహిద్‌పురం, సోలిపురం, కాకరవాయి, ఆకేరు పరివాహకంలోని తిప్పారెడ్డిగూడెం, పడమటితండా, పిండిప్రోలు, ములకలపల్లి, హైదర్‌సాయిపేట, పాలేరు వాగుల నుంచి అక్రమార్కులు జోరుగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఇసుక తవ్వకాలను ఖమ్మం, మహబాద్ పట్టణాలకు తరలిస్తున్నారు. వ్యాపారులు లక్షలాదిరూపాయలు దండుకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు

నిత్యం ఆకేరు, పాలేరు వాగులనుంచి పెద్దమొత్తంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. అధికారులుకానీ, పోలీసు ఉన్నతాధికారులు కాని పట్టించుకున్న దాఖలాలు లేవు. ముఖ్యంగా ఆయా గ్రామాల్లో అధికారపార్టీకి చెందిన నాయకులు సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుకను అక్రమంగా తరలిస్తూ లక్షలాదిరూపాయలు దండకుంటున్నారు. అధికారులు కూడా తమకేమిపట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

అడుగంటుతున్న భూగర్భజలాలు

జిల్లాలో తిరుమమలాయపాలెం మండలాన్ని భూగర్భజలాలు అడుగంటి పోకుండా ప్రభుత్వం వాల్టా చట్టాన్ని అమలు చేస్తున్నప్పటికీ ఈచట్టం ఉల్టాగా మారింది. ఇసుకను విచ్చలవిడిగా తవ్వకాలు చేపట్టడంతో భూగర్భజలాలు అడుగంటి బావులు, బోర్లలో నీటిమట్టం పడిపోతున్నాయి. అధికారులు స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పాలేరు నదిలో ఇసుక తవ్వకాలు

మహిళల చైతన్యమే లక్ష్యం

యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్

ఖమ్మంవ్యవసాయం, మార్చి6(ఆంధ్రజ్యోతి): మహిళా చైతన్యమే లక్ష్యమని యూనియన్ బ్యాక్ రీజినల్ జనర్ మేనేజర్ హనుమంత్ రెడ్డి అన్నారు. గురువారం పార్క్‌కన్వెన్షన్ హాలులో ఎంఎస్‌ఎంఈ లోన్ అభ్యర్థుల ఎంపిక నిర్వహించారు. అర్హులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాక్ ఎల్లప్పుడూ మహిళలను ప్రోత్సహించేదుకే వినూత్న పథకాలు తీసకొస్తోందన్నారు. దీనిలో భాగంగానే నారీ శక్తి స్కీం తీసుకొచ్చిందన్నారు. అనంతరం బ్యాక్‌జనరల్ మేనేజర్ కేఎస్‌డి శివ ప్రసాద్ మాట్లాడుతూ ఖాతాదారుల అభున్నతికి ఎల్లవేళలా కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఐ చైర్మన్ టీ సీతారం నాయక్, ఏజీఎమ్ సర్వేశ్, సుధాకర్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మా రాజేశ్వరావు, చాంబర్‌అఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, మీలా రవిశంకర్, వివిధ బ్యంక్ మేనేజర్‌లు ఖాతాదారులు పాల్గొన్నారు.

11న రాయల వర్ధంతి

ఖమ్మంరూరల్,మార్చి6(ఆంధజ్యోతి): ఈనెల 11న ఖమ్మంలో నిర్వహించబోయే రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సభను విజయవంతం చేయాలిన సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్రసెక్రటేరియట్ సభ్యులు ఆవునూరి మదన్న పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వెంకటాయపాలెంలో ముఖ్యనాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో లింగయ్య, గోవర్ధన్, మంగయ్య, అప్పారావు, కృష్ణ, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నేలకొండపల్లి:కామ్రేడ్ రాయల సుభాస్ చంద్రబోస్(రవన్న) అంకితభావం గల నాయకుడని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య అన్నారు. ఈనెల9న ఖమ్మంలో జరుగనున్న 9వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం నేలకొండపల్లిలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకుడు పగిడికత్తుల రాందాసు, చిర్రా భిక్షం, పగిడికత్తుల నాగేశ్వరరావు, గూడెల్లి పెద్ద వెంకన్న, కూరపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆపద మిత్ర వలంటీర్లకు శిక్షణ

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి6(ఆంధ్రజ్యోతి): నగరంలోని టేకులపల్లి మహిళ ప్రాంగణంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలతో ఆపదమిత్ర ంలంటీర్లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వరదలు ముంపులు, పెనుప్రమాదాలు ఎవైనా సంభవిస్తే ఆపదలో ఆదుకోవడానికి ఆపదమిత్రలుగా నిర్వహించాల్సిన కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని ప్రధాన వీధుల వెంట ఉన్న ఫ్లెక్సీలను ఖమ్మం నగర పాలక సంస్థ, డీఆర్ఎఫ్ బృందాలు గురువారం తొలగించారు. ఇవి ప్రమాదభరితంగా ఉండటం, డివైడర్లను ఆక్రమించటంతో ప్రజావాణిలో పలువురు ఫిర్యాదులు చేశారు. దీంతో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు ఫ్లెక్సీలను తొలగించారు.





నూతన ట్రాన్స్‌ఫారాన్ని ప్రారంభించిన ఎస్ఈ

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

- ఎస్ఈ శ్రీనివాసాచారి

మధిరటౌన్/మధిరరూరల్, మార్చి6(ఆంధ్రజ్యోతి): మధిర డివిజన్‌లో ఎక్కడా కూడా ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అయ్యేలా ఏర్పాట్లు చేశామని ఎన్పీడీసీఎల్ ఖమ్మం జిల్లా ఎస్ఈ శ్రీనివాసాచారి అన్నారు. గురువారం మధిర ఏడీఏ కార్యాలయానికి వచ్చిన ఆయనకు మధిర డివిజన్ ఉద్యోగులు ఆయనను సన్మానించారు. అనంతరం మధిర పట్టణంలోని సుందరయ్యనగర్‌లో ఏర్పాటు చేసిన నూతన 100 కేవీ ట్రాన్స్‌ఫారాన్ని ప్రారంభించారు.అనంతరం రూరల్‌లోని ఇల్లూరు, దేశినేనిపాలెం గ్రామాల్లో జరిగిన పొలంబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ బండి శ్రీనివాసరావు, మధిర, వైరా ఏడీఏలు అనురాధ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోనకల్: సూర్య ఘర్ సోలార్ పథకం ద్వారా సహజ వనరులను కాపాడుకోవడంతో పాటు విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చునని విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి తెలిపారు. స్థానిక రైతువేదిక కార్యాలయంలో గురువారం రైతులు, విద్యుత్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంల మాట్లాడుతూ సోలార్ సిస్టంను ఇంటి పైన ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రసారమయ్యే విద్యుత్ ఇంటి అవసరాలకు వినియోగించుకొని మిగిలిన విద్యుత్‌ను అమ్ముకోవచ్చునని పేర్కొన్నారు. ప్రతి నెల మూడు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించే సూర్య ఘర్ సోలార్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తెలిపారు. మండలంలోని చిరునోములలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించామని, ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూస్తున్నామని స్పష్టం చేశారు. తప్పని సరిగా రక్షణ కిట్‌లను ఉపయోగించాలని సూచించారు.విద్యుత్ సిబ్బంది కొరత వలన ఇబ్బందులు పడుతున్నామని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీఈఈ శ్రీనివాసరావు, ఏడీఈ కిరణ్, ఏఈఈ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గెలుపుపై బీజేపీ సంబరాలు

ఖమ్మంబైపాస్‌రోడ్,మార్చి6(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు నేపథ్యంలో అర్బన్, టౌన్‌అధ్యక్షుడు కుమిలి శ్రీనివాసరావు ఆధ్వర్యలలో విజయోత్సవం నిర్వహించారు బాణసంచా కాల్చి పార్టీకార్యకర్తలకు మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో అసెబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, రాము, హుస్సేన్, ,సీతారాములు, ఉపేందర్ పాల్గొన్నారు.

తాండ్ర వినోదరావు హర్షం

ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎమ్మెల్సీలుగా ముల్క కొమరయ్య, అంజిరెడ్డి విజయంపై బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం పట్ల రాష్ట్ర బీజేపీ కార్యకర్తలంతా తమ విజయంగా భావిస్తున్నారని ఆ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ తిరుగులేని శక్తిగా ఎదుగుతుందని ప్రజలంతా బీజేపీ కోసం ఎదురు చూస్తున్నానన్నారు.

బీజేపీ విజయోత్సవ ర్యాలీ

నేలకొండపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించటంతో నేలకొండపల్లిలో విజయోత్సవం నిర్వహించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం రాష్ట్ర నాయకుడు భవనాశి దుర్గారావు, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావటం ఖాయమన్నారు. అందుకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించటమే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు మన్నె కృష్ణారావుయాదవ్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు షేక్.షర్ఫుద్దీన్, నాయకులు సూరేపల్లి జ్ఞానరత్నం, కల్యాణం నాగేశ్వరరావు పాల్గొన్నారు.



నేలకొండపల్లిలో బీజేపీ శ్రేణుల ర్యాలీ

శ్రీపాల్‌రెడ్డిది ఉపాధ్యాయ, అధ్యాపకుల విజయం



మాట్లాడుతున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పింగళి శ్రీపాల్‌రెడ్డి విజయం ఉపాధ్యాయ, అధ్యాపకుల విజయమని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడుయలమద్ది వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీగా గెలుపొందిన శ్రీపాల్‌రెడ్డికి అభినందన సభ నిర్వహించారు. పీఆర్టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించడం ఉపాధ్యాయ, అధ్యాపకుల కృషి వల్లనేన్నారు. ఈకార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు మోతుకూరి మధు, వెంకటనరసయ్య, కొండలరావు, కట్టా శేఖర్, సోమ్లానాయక్, గుడుపుడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీరందించేలా చూస్తాం

» ఇరిగేషన్ ఎస్ఈ వాసంతి

బోనకల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆళ్లపాడు మైనర్ కాలువకు రెండు రోజుల్లో నీటిని విడుదల చేసేలా చూస్తామని ఇరిగేషన్ ఎస్ఈ వాసంతి రైతులకు భరోసా ఇచ్చారు. మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో గురువారం ఆమె రైతులతో మాట్లాడారు. చివర భూముల్లో సాగు చేసిన మక్క పంటలకు ప్రస్తుతం నీటి తడులు చాల అవసరమని రైతులు తెలిపారు. కంకి గింజ పట్టే దశలో ఉన్నందున తడులు ఆలస్యమైతే దిగుబడులు రాక నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఆమె ముందుగా మండలంలోని ఆళ్లపాడు మైనర్‌కు నీటిని విడుదల చేసి చివర భూములు తడిసే విధంగా చూస్తామని రైతులు ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ, ఏవో వినయ్ కుమార్, ఏఈ ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

సత్తుపల్లిరూరల్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 77మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 7 కేంద్రాలను కేటాయించగా 1,337కి గానూ 1,260మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపారు.

మధిరటౌన్, మార్చి6(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిసింది. మధిరలో మొత్తం 972 మందికి గాను 19 మంది పరీక్షకు హాజరుకాలేదు. మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయదాసు పరీక్షల కన్వీనర్‌గా వ్యవహరించారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ

చింతకాని, మార్చి 6(ఆంధ్రజ్యోతి): చింతకాని మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామం జనసంద్రంగా మారింది. గురువారం గ్రామంలో వైభవంగా శ్రీ విజయశీతలా మహాచక్ర దివ్యజీవ నాభిశిలా (బొడ్రాయి), ముత్యాలాంబ తత్పరివార దేవతా ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా వేద పండితుల ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. సుమారు పది వేల మంది భక్తులు బొడ్రాయి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

సత్తుపల్లిరూరల్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): మీమీ ప్రాంతాలలో ఒక ఆడపిల్ల జననానికి గుర్తుగా అంగన్‌వాడీ కేంద్రంలో, పాఠశాలల్లో ఒక మొక్కను నాటడం ద్వారా బేటీ జన్మోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త ఎస్‌డీ.సమీన్ అన్నారు. బేటి బచావో బేటీ పడావో దశాబ్ధి ఉత్సవాలలో భాగంగా సత్తుపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని సీమాంగ్ సెంటర్‌లో పీసీ, పీఎన్‌డీటీ డ్రైవ్ బేటి జన్మోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ పీ.ప్రమీల, ఎస్ఎఫ్ఎల్ కే.సతీష్, వైద్యులు వసుమతిదేవీ, ప్రేమలత, గ్రీష్మ, ఎన్ఎస్ వెంకటరామలక్ష్మి, హెడ్‌నర్స్ హైమావతి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కల్లూరులో....

కల్లూరు, మార్చి6 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి, మహిళ సాధికారత కేంద్రం జిల్లా సమన్వయ కర్త ఎస్‌డీ. సమీన్ సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కనకదుర్గ, డీహెచ్‌ఈడబ్ల్యూ జెండర్ స్పెషలిస్ట్ పి. ప్రమీల, ఎస్ఎఫ్ఎల్ సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సత్తుపల్లిరూరల్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం సత్తుపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకా రం.. స్థానిక గాంధీనగర్‌కు చెందిన తడికమళ్ల సతీష్ కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంట్లో ఎవరూ లేనిసమయంలో మద్యం మత్తులో ఓ లిక్విడ్‌ను తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన బంధువులు ఆటోలో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం సతీష్ ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు తెలిపారు.

కిష్టారం గ్రామంలో....

సత్తుపల్లిరూరల్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో బ్లేడుతో ఓ లారీ డ్రైవర్ చేతులు కోసుకున్న సంఘటన సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాలకుర్తి నాగరాజు ఓసీలో లారీడ్రైవర్‌గా పనిచేస్తుండగా భార్య కొద్దినెలల క్రితం పుట్టింటికి వెళ్లగా కుటుంబ పెద్దల మధ్య పలుమార్లు పంచాయితీలు జరగ్గా తీవ్ర మనస్థాపానికి గురవ్వడంతో ఆర్థిక ఇబ్బందులు తోడయ్యాయి. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బ్లేడుతో రెండు చేతులను కోసుకుని రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు 108లో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఖమ్మం తరలించారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

» ఎస్ఈ శ్రీనివాసాచారి


మధిరటౌన్‌లో మాట్లాడుతున్న ఎస్ఈ శ్రీనివాసాచారి

మధిరటౌన్/మధిరరూరల్, మార్చి6(ఆంధ్రజ్యోతి): మధిర డివిజన్‌లో ఎక్కడా కూడా ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అయ్యేలా ఏర్పాట్లు చేశామని ఎన్పీడీసీఎల్ ఖమ్మం జిల్లా ఎస్ఈ శ్రీనివాసాచారి అన్నారు. గురువారం మధిర ఏడిఏ కార్యాలయానికి వచ్చిన ఆయనకు మధిర డివిజన్ ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం మధిర పట్టణంలోని సుందరయ్యనగర్‌లో ఏర్పాటు చేసిన నూతన 100 కేవీ ట్రాన్స్‌ఫారాన్ని ప్రారంభించారు. అనంతరం రూరల్ లోని ఇల్లూరు, దేశినేనిపాలెం గ్రామాల్లో జరిగిన పొలంబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ బండి శ్రీనివాసరావు, మధిర, వైరా ఏడీఏలు అనురాధ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోనకల్‌లో...

బోనకల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ సోలార్ పథకం ద్వారా సహజ వనరులను కాపాడుకోవడంతో పాటు విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చునని విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి తెలిపారు. స్థానిక రైతువేదిక కార్యాలయంలో గురువారం రైతులు, విద్యుత్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోలార్ సిస్టంను ఇంటి పైన ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రసారమయ్యే విద్యుత్ ఇంటి అవసరాలకు వినియోగించుకొని మిగిలిన విద్యుత్‌ను అమ్ముకోవచ్చునని పేర్కొన్నారు. ప్రతి నెల మూడు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించే సూర్యఘర్ సోలార్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తెలిపారు. మండలంలోని చిరునోముల గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించామని, ప్రభుత్వ అనుమతి కోసం ఎదురు చూస్తున్నామని స్పష్టం చేశారు. తప్పని సరిగా రక్షణ కిట్‌లను ఉపయోగించాలని సూచించారు. విద్యుత్ సిబ్బంది కొరత వలన ఇబ్బందులు పడుతున్నామని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీఈఈ శ్రీనివాసరావు, ఏడీఈ కిరణ్, ఏఈఈ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఇంటి పన్నులు వసూళ్లు చేయాలి

» డీపీవో ఆశాలత

బోనకల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఈ నెల 20వ తేదీ నాటికి ఇంటి పన్నుల వసూళ్లు వందశాతం పూర్తి చేయాలని డీపీవో ఆశాలత ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం చింతకాని, బోనకల్ మండల పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో ఉన్న దుకాణాలకు సంబంధించి ట్రేడ్ లైసెన్సులు, వాటిని రెన్యూవల్ చేయించుకునేలా చూడాలని కోరారు. చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీరాజ్ అధికారి రాంబాబు, ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంపీవో వి.వి.ఎస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

» యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగుర్‌వలీ

మధిరటౌన్,మార్చి6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం కొనసాగిస్తామని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగుర్‌వలీ అన్నారు. గురువారం మధిరలోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి నర్సిరెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా పనిచేశారని అన్నారు. స్వల్ప తేడాతో ఓడిపోయామని, దీనికి ఎవరూ నిరుత్సాహ పడవలసిన పనిలేదన్నారు. ఉపాధ్యాయ సమస్యలు, ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతం కోసం మరింత పట్టుదలతో పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, ఇబ్రహీం, ఖాజా, సనీత, వీరయ్య, రమేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

తల్లాడ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు 450రోజులైనా అమలుకు నోచుకోలేదని సీపీఎం రాష్ట్ర నాయకురాలు మాచర్ల భారతి అన్నారు. గురువారం స్థానిక దొడ్డా కృష్ణయ్య భవనంలో నల్లమోతు మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు, నాయకులు పులి కృష్ణయ్య, శీలం పకీరమ్మ, చల్లా నాగేశ్వరరావు, షేక్.మస్తాన్, పులి వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

సత్తుపల్లిరూరల్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో భార్యభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. వేంసూరు మండలం కోకిలంపాడుకు చెందిన శీలపురెడ్డి కృష్ణారెడ్డి, మల్లేశ్వరి దంపతులు ద్విచక్ర వాహనంపై సత్తుపల్లికి వస్తున్నారు.

ఈ క్రమంలో వేంసూరు పోలీస్‌స్టేషన్ సమీపంలో ట్రాక్టర్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇరువురిని 108లో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రయివేట్ ఆసుపత్రికి వెళారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలి

» విద్యుత్‌శాఖ డీఈఈ ఎల్.రాములు

సత్తుపల్లిరూరల్, మార్చి6 (ఆంధ్రజ్యోతి): ఈ వేసవిలో వాటర్ సప్లయ్ డిస్ట్రిబ్యూషన్ పాయింట్ల వద్ద విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలని విద్యుత్‌శాఖ డీఈఈ ఎల్.రాములు ఆదేశించారు. గురువారం ప్రభుత్వ ఆసుపత్రితో పాటు మునిసిపాలిటీలోని వాటర్ పాయింట్లను పరిశీలించారు. పట్టణంలో నీటి అవసరాలు తీర్చడానికి మిషన్ భగీరథ నీటితో పాటు దాదాపు 40బోర్ల నుంచి నీటి తీసుకుంటున్నట్లు గుర్తించామన్నారు. వాటిని తనిఖీ చేసి బోర్ పాయింట్లకు ఎటువంటి విద్యుత్ సంబంధిత సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కొండా నర్సింహ, వైద్యులు సాత్విక్ ఉన్నారు.


బోర్ పాయింట్లను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో డీఈఈ

'కారేపల్లి మండలాన్ని అగ్రస్థానంలో నిలపాలి'

కారేపల్లి, మార్చి6(ఆంధ్రజ్యోతి): ఇంటిపన్ను వసూళ్లలో మండలాన్ని జిల్లాలోనే అగ్రస్థానంలో నిలపాలని ఎంపీవో రవీంద్రప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిపన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వద్దని సూచిం చారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ సంబురాలు

కల్లూరు, మార్చి6 (ఆంధ్రజ్యోతి) నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి పింగలి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించటం పట్ల కల్లూరులో మండల పీఆర్టీయూ శాఖ ఆధ్వర్యంలో గురువారం విజయోత్సవ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మెయిన్ సెంటర్‌లో ఉపాధ్యాయులు విజయోత్సవం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల పీఆర్టీయూ అధ్యక్షుడు పాకల రమేష్, కార్యదర్శి చంద్‌సాహెబ్‌లు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ శ్రీపాల్‌రెడ్డి విజయం ఉపాధ్యాయ, అధ్యాపకుల విజయంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు నామా కృష్ణమూర్తి, బోబోలు శ్రీనువాసరావు, ఎండి మౌలాలి, బీరవల్లి శ్రీనువాసరావు, బాలజీనాయక్, టీ సత్యనాయరణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పంటల వైవిధ్యంలో ఏఈవోలే కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రగతికుమారి

వైరా, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల్లో వైవిధ్యం ప్రదర్శించేందుకుగానూ వ్యవసాయ విస్తరణ అధికారులు కీలక భూమిక పోషించాలని పలువురు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం జిల్లాస్థాయి వ్యవసాయ విస్తరణ అధికారు(ఏఈవో)లకు పంటల వైవిధ్యంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన అఖిలభారత సమన్వయ పరిశోధనా సంస్థ-సమగ్ర వ్యవసాయ పద్ధతుల విభాగం(రాజేంద్రనగర్) వ్యవసాయ పరిశోధనా సంస్థ మధిర, కృషి విజ్ఞాన కేంద్రం(వైరా)వారు సంయుక్తంగా ఏఈవోలకు శిక్షణనిచ్చారు. దేశంలోని 75జిల్లాల్లో ఈ శిక్షణ కార్యక్రమం అమలవుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. సమగ్ర వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గోవర్ధన్, వ్యవసాయ పరిశోధన సంస్థ కోఆర్డినేటర్ సీహెచ్.ప్రగతికుమారి పంటల్లో వైవిధ్యంపై శిక్షణనిచ్చారు. డాక్టర్ రుక్మిణిదేవి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ జె.రవీందర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ పణిశ్రీ, డాక్టర్ టి.భరత్, డాక్టర్ కె.నాగస్వాతి, డాక్టర్ జి.వినయ్, సాయిబాబు తదితరులు వివిధ అంశాల్లో శిక్షణనిచ్చారు.

నేడు జమలాపురంలో వకుళమాత స్టేడియం శిఖర ప్రతిష్ఠ

ఎర్రుపాలెం, మార్చి6(ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కేఎస్ఆర్ గ్రానైట్ అధినేత తుళ్లూరి కోటేశ్వరరావు నిర్మల కుమారి దంపతులు భారీ వ్యయంతో నూతనంగా నిర్మించిన వకుళమాత స్టేడియం (శ్రీవారి కల్యాణ మండపం) శుక్రవారం శిఖర ప్రతిష్ఠతో ప్రారంభం కానుంది.

నూతన కల్యాణ మండపంలో మధ్యాహ్నం 12గంటలకు వేదమంత్రోచ్చారణల మధ్య తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితుడు జునూతల త్రివేది శర్మ బ్రహ్మత్వంలో ఆగమ పండితుల ఆధ్వర్యంలో ఋగ్వేద వైదిక స్మార్త ఆగమ శాస్త్ర సంప్రదాయం ప్రకారం శ్రీ అలివేలుమంగ పద్మావతిసమేతంగా వెంకటేశ్వర స్వామి మొట్టమొదటి శాంతి కల్యాణం నిర్వహిస్తారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త కపిలవాయి అచ్యుతరామారావు చే శ్రీ వెంకటేశ్వర వైభవం, కల్యాణ వ్యాఖ్యానం చేయనున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రఘురాంరెడ్డి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని, జిల్లా ముఖ్య నేతలు మువ్వా విజయ్‌బాబు, రాయల నాగేశ్వరరావు పాల్గొనున్నారు.


శేషవస్త్రాలతో కోటేశ్వరరావు నిర్మలకుమారి దంపతులు

నిర్మాణదాతల తుళ్లూరి కోటేశ్వరావు నిర్మల కుమారి దంపతులు యాగశాలలో శ్రీవారి పంచలోహ ఉత్సవమూర్తులకు దాన్యాదివాసం, పుష్పాదివాసం, శయ్యాది వాసం, ప్రత్యేక పూజలు అనంతరం మేళా తాళాలతో ఊరేగింపుగా తమనివాసం నుంచి ఆలయం చేరుకుని శ్రీవారిని పెండ్లికుమారుడిగా అమ్మవార్లను పెండ్లి కూతురుగా చేసి శేషవస్త్రాలను సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు.

10వ తేదీలోపు వేతనాలు చెల్లించాలి

» పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూకలకుంట రవి

సత్తుపల్లి, మార్చి6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఓబీ కార్మికులకు ప్రతినెలా 10వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూకలకుంట రవి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక టీయూసీయూ కార్యాలయంలో ఓబీ కాంట్రాక్ట్ వర్కర్స్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఓబీ ఆపరేటర్ల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా అధ్యక్షప్రధాన కార్యదర్శులుగా సీహెచ్.వెంకటేష్, వీ.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కే.కృష్ణయ్య, సహాయ కార్యదర్శిగా ఎం.రాజా, కోశాధికారిగా వీ.అశోక్ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ఏ.వెంకన్న, నాయకులు సీవై.పుల్లయ్య, ఏ.శరత్, బీ.రమేష్, రవికుమార్, మురళీకృష్ణ, ప్రసాద్, రవి, బాలరాజు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రైతు మహాసభను జయప్రదం చేయాలి

» రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్

మధిర రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఈనెల 20న జరిగే రైతు సంఘం ఖమ్మం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ పిలుపునిచ్చారు. గురువారం మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో జరిగిన సంఘం గ్రామశాఖ సభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బెజవాడ రవిబాబు, వూట్ల కొండలరావు, ఆనందరావు, వంగా శేషగిరిరావు, ఎం.ఏ.రహీం పాల్గొన్నారు.

బీఆర్ఎస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

పెనుబల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ 2025 క్యాలెండర్లు, డైరీలను ఆపార్టీ మండల నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కనగాల సురేష్‌బాబు, గోదా చెన్నారావు, కనగాల వెంకట్రావ్, చెక్కిలాల లక్ష్మణ్ రావు, కొప్పుల గోవిందరావు, మందడపు అశోక్‌కుమార్, లగడపాటి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, గిరిజాపతిరావు, మల్లెల శ్రీనివాసరావు, గౌస్‌పాల్గొన్నారు.

పాఠశాల పునఃప్రారంభంపై సమీక్ష

కల్లూరు, మార్చి6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముచ్చవరం ప్రభుత్వ పాఠశాలలో గురువారం విశ్వానాథపురంలో మూతబడిన పాఠశాల పునః ప్రారంభంపై సీఎవో రాజశేఖర్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమీక్షించారు. ఈ ఏడాది విద్యాసంవత్సరంలో విద్యార్థుల నమోదు లేక పోవడంతో పాఠశాల మూతపడింది. పాఠశాల పునః ప్రారంభించాలని గ్రామస్థులు విజ్ఞప్తి మేరకు జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎంఓ రాజశేఖర్ సమక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. వారికి గాను పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ దుస్తులు అందజేశారు. అనంతరం హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ తరుపున విద్యార్థులకు స్టేషనరి అందించారు.

రేపల్లెవాడలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం

చింతకాని, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేపల్లెవాడ గ్రామాన్ని ప్రభుత్వ పథకాల అమలు కోసం మోడల్ గ్రామంగా ఇటీవల ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇప్పటికే గ్రామంలోని రైతులందరికీ రైతుభరోసా పథకం వంద శాతం అమలు చేయగా, తాజాగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గురువారం ఇళ్ల నిర్మాణం కోసం అధికారులు మార్కింగ్ నిర్వహించారు. ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు గ్రామంలో పర్యటించి పలువురు లబ్ధిదారులతో మాట్లాడి పథకం అమలు తీరును పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి రామారావు, నాయకులు మడుపల్లి రాంప్రసాద్, బండి శ్రీనివాసరావు, మడుపల్లి చిన్న భాస్కర్, కిరణ్‌బాబు, రవికుమార్‌పాల్గొన్నారు.

గీత కార్మికుడి ప్రాణాలు కాపాడిన కాటమయ్య కిట్టు


తాటిచెట్టు పై నుంచి వేలాడుతున్న గీత కార్మికుడు

బోనకల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): బతుకు దెరువు కోసం తన వృత్తిలో భాగంగా కల్లు తీసేందుకు వెళ్లాడు గీత కార్మికుడు. తాడిచెట్టు పైకి ఎక్కుతున్న క్రమంలో కాళ్లకు ఉన్న బందం జారి పోగా గాలిలో వేలాడిన అతడికి ప్రాణం పోసింది కాటమయ్య రక్షణ కిట్టు. ఈ సంఘటన గురువారం ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బంధం పెద్ద గోవిందు కల్లు గీత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. గీతకు వెళ్లిన అతడు తాడిచెట్టు పైకి ఎక్కగా ఒక్కసారిగా కాళ్లకు ఉన్న బందాలు జారి పోయాయి. దీంతో గీత కార్మికుడి నడుముకు ఉన్న రక్షణ కిట్టు తాడు కిందకు జారనీయకుండా ఉండటంతో గాలిలో వెలాడుతూ కేకలు వేశాడు. పొలాల్లో ఉన్న రైతులంతా అక్కడకు చేరుకున్నారు. ట్రాక్టర్‌ను తీసుకొచ్చి హైడ్రాలిక్ ద్వారా ట్రక్కును పైకి లేపి అందులో నిచ్చెన వేసి కిందకు దించారు.

మట్టూరి కమలమ్మకు పలువురి నివాళి


కమలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కోటేశ్వరరావు

వైరా, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకగిరి సిరిపురంలో కాంగ్రెస్ సీనియర్ నేత మట్టూరి వెంకటేశ్వరరావు మాతృమూర్తి మ ట్టూరి కమలమ్మ చిత్రపటానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. కాంగ్రెస్ సీనియర్ దివంగత నేత మట్టూరి వీరయ్య సతీమణి అయిన కమలమ్మ దశదినకర్మ కార్యక్రమం గురువారం సిరిపురంలో జరిగింది. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్ రావు, పూసలపాడు సొసైటీ అధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ మచ్చా బుజ్జీ, మాజీ సర్పంచ్‌లు మచ్చా నర్సింహారావు, పర్చూరి రామారావు, మట్టూరి సత్యప్రసనాంబ, మోరంపూడి బాబూరావు, మక్కెన రమేష్, కనగంటి రావు, అశోక్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు నివాళులర్పించారు.